మా అక్షరాలు - నిజాల నిప్పుకణికలు

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 225 వెల - రూ 5:00

Email: prajamantalu@gmail.com www.prajamantalu.com ఎడిటర్: సిహెచ్.వి. ప్రభాకర్ రావు

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnag Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yad



## సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అణచివేత కుట్రలు

● ఎన్నికల ముందు కమలాహారిస్ బృందంపై దుమారం



న్యూయార్క్,అక్టోబర్23 (ప్రజా మంటలు): సోషల్ మీడియా దిగ్గజ ప్లాట్ ఫాం 'ఎక్స్'ను అణచివేయడానికి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ బృందం కుట్ర పన్నుతోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కమలా హారిస్ బృందంలో ఇంగ్లాండ్‌కు చెందిన పొలిటికల్ ఆపరేటివ్ మోర్గాన్ మెక్ స్వీనీ ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే,

మిగతా 2లో..

## వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులే..

**వారికి సేవ చేసేందుకే ఇక్కడికి వచ్చా**

- రాజకీయాల కోసం ఇక్కడి రాలేదు
- వయనాడ్ ర్యాలీలో ప్రియాంక వెల్లడి
- కాంగ్రెస్ అగ్రనేతల సమక్షంలో నామినేషన దాఖలు
- తనలాగే చెల్లిని ఆదరించాలని రాహుల్ పిలుపు
- కార్యక్రమంలో పాల్గొన్న సోనియా, ఖర్గే, రేవంత్, భట్టి



తిరువనంతపురం, అక్టోబర్ 23 (ప్రజా మంటలు): వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులతో సమానమని కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ పేర్కొన్నారు. వయనాడ్ ఉప ఎన్నిక నేథ్యంలో ఇక్కడి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రియాంక గాంధీ బుధవారం తన నామినేషన్ దాఖలు చేశారు. అంతకుముందు భారీ ర్యాలీ నిర్వహించిన ప్రియాంక గాంధీ, అనంతరం జరిగిన బహిరంగ సభలో కాంగ్రెస్ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడారు. తన కొత్త ప్రయాణాన్ని వయనాడ్‌లో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తాను రాజకీయాల కోసం ఇక్కడకు రాలేదని, ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం వయనాడ్ వచ్చినట్లు తెలిపారు. రాజకీయానికంటే ఈ దేశం ముఖ్యమన్నారు. సమానత్వం కోసం కాంగ్రెస్ పార్టీ

మిగతా 2లో..

## నాంపల్లి కోర్టుకు హాజరైన కెటిఆర్

**తన పరువ ప్రతిష్టలకు భంగం కలిగిందని వెల్లడి**

**కొండా సురేఖ ఆరోపణలపై వాంఙ్మూలం**



హైదరాబాద్, (ప్రజా మంటలు): పరువునష్టం దావా కేసులో మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లి కోర్టులో వాంగ్మూలం ఇచ్చారు. దాదాపు 20 నిమిషాల పాటు ఆయన స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డు చేసింది. మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలతో తన పరువు ప్రతిష్టలు దెబ్బతిన్నాయని, పబ్లిసిటీ కోసమే ఆమె ఇలాంటి వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. కేటీఆర్ వెంట సాక్షులు దాసోజు శ్రవణ్, సత్యవతి రాథోడ్, బాల్కసుమన్, మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి నాంపల్లి కోర్టుకు వచ్చారు. కేటీఆర్‌తో పాటు దాసోజు శ్రవణ్ వాంగ్మూలాలు నమోదు చేసిన నాంపల్లి కోర్టు.. మిగిలిన సాక్షుల వాంగ్మూలాలను ఈనెల 30న నమోదు చేయనుంది. మంత్రి కొండా సురేఖ తన పరువు, ప్రతిష్ట దెబ్బ తీసే విధంగా మాట్లాడిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం నాంపల్లి కోర్టుకు తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై క్రమినల్ చర్యలు తీసుకోవాలని నాంపల్లి ప్రత్యేక కోర్టును ఈ సందర్భంగా కేటీఆర్ అభ్యర్థించారు. గత 18 ఏళ్లుగా రాజకీయ జీవితంలో తాను ఉన్నానన్నారు. అయితే ఆమె.. తన మాటలతో తానను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం నాంపల్లి కోర్టులో మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలపై విచారణ జరిగింది. అందులోభాగంగా కేటీఆర్ నాంపల్లి ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. రాజకీయ కక్ష్య సాధింపు చర్యలో భాగంగానే ఆమె ఇలాంటి వాక్యాలు చేసిందని కేటీఆర్ ఆరోపించారు. సమాజంలో తనకు మంచి పేరు ప్రతిష్టలు ఉన్నాయని.. అయితే వాటిని దిగజార్చాలానే

మిగతా 2లో..



## ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అరెస్టులా

**మండిపడ్డ బిఆర్ఎస్ నేత హరీష్ రావు**

హైదరాబాద్, (ప్రజా మంటలు): యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిర్మించ తలపెట్టిన అదానీ- అంబుజా సిమెంట్ పరిశ్రమపై నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణకు భారాస నేతలు వెళ్లకుండా అడ్డుకోవడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. నల్గొండ జిల్లాలో భారాస నాయకులను అరెస్టు చేయడం పట్ల ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వేచ్ఛగా జరగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణను, నిర్బంధాల మధ్య నిర్వహించడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజాపాలన అంటూ నిర్బంధ పాలన కొనసాగించడం సిగ్గుచేటని కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అక్రమంగా అరెస్టులు చేసిన భారాస నాయకులు, ప్రజా సంఘాల నేతలు, పర్యావరణవేత్తలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

**ఉచిత ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దు**

**ఇసుక అక్రమంగా విక్రయిస్తే పిడి యాక్ట్**

**కొరత ఉన్న ఐదు జిల్లాలో ఇసుక పాయింట్ల ఏర్పాటు**

**విశాఖ శారదాపీఠం భూముల కేటాయింపు రద్దు**

**ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు**

**ఎపి కేబినేట్ భేటీలో కీలక నిర్ణయాలు**



అమరావతి,అక్టోబర్ 23 (ప్రజా మంటలు): దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చేందుకు ఎపి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. నగదు చెల్లించి సిలిండర్ కొనుగోలు చేస్తే.. 48 గంటల్లో తిరిగి అకౌంట్‌లో నగదు జమయ్యేలా చూడాలని నిర్ణయించారు. ఒకేసారి మూడు సిలిండర్లు తీసుకోకుండా ప్రతి నాలుగు నెలలకు ఒక సిలిండర్ ఇవ్వాలని నిర్ణయించారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వంపై ఏడాదికి రూ.2700 కోట్ల భారం పడుతుందని మంత్రివర్గంలో చర్చ జరిగింది. ఉచిత ఇసుక విధానంలో సీనరేజ్, జీఎస్టీ ఛార్జీల రద్దుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సీనరేజ్ ఛార్జీల రద్దు వల్లే ప్రభుత్వంపై రూ.264 కోట్ల భారమని అంచనా వేశారు. ఉచిత ఇసుక లక్ష్యం నెరవేర్చేందుకు నష్టం భరిద్దామని సీఎం చంద్రబాబు చెప్పినట్టు సమాచారం. పట్టా భూముల్లో ఎవరి ఇసుక వారు తీసుకునేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఉచిత ఇసుక సరిగా అమలయ్యేలా చూడాలని మంత్రులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఇసుక లేని జిల్లాల్లో మినరల్ డీలర్లను పెట్టి ధరల నియంత్రణ చేపట్టాలని నిర్ణయించారు. ఇసుక విధానాన్ని అతిక్రమిస్తే ... పిడి యాక్ట్ పెట్టాలని కూడా ఆదేశించారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగ కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పార్థసారధి, అనిత, నాదెండ్ల మనోహర్, కొల్లు రవీంద్ర వివరించారు. కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఇసుక సీనరేజ్, జీఎస్టీ ఛార్జీలు రద్దుకు కేబినెట్ ఆమోదం తెలిపిందని అన్నారు. పూర్తిగా ఉచితంగా ఇసుకను అందజేస్తున్నామని తెలిపారు. ఉచిత ఇసుకతో వ్యాపారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఉచిత ఇసుకను అక్రమంగా రవాణా చేసినా, విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇసుక కొరత ఉన్న ఐదు జిల్లాలో ప్రత్యామ్నయ్య పాయింట్లు ఏర్పాట్లు చేయనున్నా మని వివరించారు. ఉచిత ఇసుకను ఇతర సరిహద్దు రాష్ట్రాలకు తరలించకుండా చెక్‌పోస్టులను బలోపేతం చేస్తామని, నిరంతరం సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవోలన్నింటినీ ఈ పోర్టల్ గెజిట్‌లో పొందుపరిచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. రూ. 20 కోట్ల ఆదాయం వచ్చే దేవాలయాల కమిటీల్లో ఇదివరకు ఉన్న 15 మంది గల సభ్యుల సంఖ్యను 17 కు పెంచేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుల్లో బ్రాహ్మణులకు, నాయీ బ్రాహ్మణులకు సభ్యత్వం ఇవ్వాలని నిర్ణయించారు. విశాఖ నర్సింగ్ కళాశాలలో ప్రస్తుతమున్న సీట్లను 25 నుంచి

మిగతా 2లో..

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆందోళన

**ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకిస్తూ ప్రజల నిరసన**

**ప్రజల ఆందోళనతో రామన్నపేటలో ఉద్రిక్తత**


**బిఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్**



రామన్నపేట,అక్టోబర్23 (ప్రజా మంటలు): యాదాద్రి భువనగిరి జిల్లాలోని రామన్నపేటలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు వ్యతిరేకంగా స్థానికులు ఆందోళనకు దిగారు. సిమెంటు ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం నిర్వహిస్తున్న ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు అడ్డుకున్నారు. పోలీసుల నిర్బంధాలను దాడుకు ప్లకార్డులు, నల్లజెండాలతో నిరసనకు దిగారు. పర్యావరణవేత్తల పేరుతో అంబుజాకు అనుకూలంగా మాట్లాడేందుకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చినవారిని తరిమికొట్టారు. పరిశ్రమ పేరుతో తమ బతుకులను బుగ్గి చేస్తే సహించేది లేదని హెచ్చరిక చేశారు. కంపెనీ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఒపుకునేది లేదని తేల్చిచెబుతున్నారు. కాగా, కంపెనీని ఏర్పాటును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. ఎట్టిపరిస్థితలో పరిశ్రమ నిర్మాణాన్ని అడ్డుకుంటామని ప్రకటించింది.

మిగతా 2లో..

## ప్రజా నాడి



జగిత్యాల రాజకీయాలను ఒక కుదుపు కుడిపిన

## రాజకీయ హత్య

**ఇది జీవన రెడ్డి రాజకీయ చరిత్ర ముగింపుకు కుట్రనా ?**



రేపటి భవిష్యత్ నిర్ణయమేమిటి?

కాంగ్రెస్ లో సీనియర్ల పరిస్థితి ఇంతేనా?

జగిత్యాలలో జరిగిన కాంగ్రెస్ నాయకుడు మార గంగారెడ్డి హత్య తరువాత అక్కడ ఏం జరగనున్నది?

రాజకీయంగా జీవన్ రెడ్డి పరిస్థితి ఏమిటి ..

పూర్తి విశ్లేషణ 4లో..



మొదటి పేజీ తరువాయి

## వయనాడ్ ప్రజలు తన కుటుంబ సభ్యులే..

పోరాడుతుందన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీ దేశం మొత్తం తిరిగారని, ప్రజలను ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు, వారి సమస్యలను తెలుసుకునేందుకు దేశ వ్యాప్తంగా పర్యటించినట్లు చెప్పారు. వయనాడ్ ప్రజలకు అండగా ఉండేందకు తాను ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. ఇక్కడి ప్రజలతో కలిసి పోరాడేందుకు, వారి సమస్యల పరిష్కారానికి వయనాడ్‌కు వచ్చినట్లు తెలిపారు. వయనాడ్ ప్రజల తరపున ప్రాతినిధ్యం వహించేందుకు ఇక్కడకు వచ్చానన్నారు. రాహుల్ మాట్లాడుతూ..తనకులాగే వయనాడ్ నుంచి తన సోదరి ప్రియాంకగాంధీని ఆశీర్వదించాలన్నారు. వయనాడ్ నుంచి అధికారికంగా ఒకరు పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహిస్తే.. మరొకరు అనధికారికంగా వయనాడ్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తామన్నారు. ఇక్కడి ప్రజల కోసం తాను ఎప్పటికీ పోరాడుతూనే ఉంటానన్నారు. తన తల్లి ఇక్కడ ఉన్నారని, తండ్రి చనిపోయిన తర్వాత తన సోదరి ప్రియాంక గాంధీ అమ్మను చూసుకుంటున్నార్నారు. ప్రియాంక 17 ఏళ్ల వయసులో తండ్రిని కోల్పో యిందని, అయినప్పటికీ తమ తల్లికి తోడుగా నిలిచిందని రాహుల్ తెలిపారు. ప్రియాంకగాంధీ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలే ప్రియాంక కుటుంబమన్నారు. ఆ కుటుంబం కోసం ఎలాంటి త్యాగానికైనా



సిద్ధమన్నారు. వయనాడ్ ప్రజలకు తన సోదరిని అప్పగిస్తున్నానని, ప్రియాంక గాంధీని ఇక్కడి ప్రజలే రక్షించుకోవాలన్నారు. అనధికార ఎంపీగా తాను కూడా తరచూ వయనాడ్‌కు వస్తుంటానని రాహుల్ గాంధీ తెలిపారు. వయనాడ్ సభలో సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గేతో పాటు కర్ణాటక సీఎం సిద్ధరామయ్య, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు పాల్గొన్నారు. వయనాడ్ ఎంపీగా కాంగ్రెస్ నుంచి ప్రియాంక గాంధీ పోటీ చేస్తుండగా.. లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) నుంచి సీపీఐకి చెందిన సత్యన్ మొకేరి, బీజేపీ నుంచి నవ్య హరిదాస్ పోటీచేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నవ్య హరిదాస్ తన రాజకీయ అనుభవం ఆధారంగా ప్రియాంక గాంధీకి సవాలు విసిరారు. సింగపూర్, నెదర్లాండ్స్‌లో పనిచేసిన నవ్య కోజికోడ్ కౌన్సిలర్‌గా ఉన్నారు. కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానం నుంచి బరిలోకి దిగుతున్న ప్రియాంక గాంధీ నామినేషన్ దాఖలు చేయడానికి ముందు వయనాడ్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు.



నామినేషన్ దాఖలు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో పాటు ఇతర సీనియర్ నేతలు పాల్గొనగా.. ర్యాలీలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారీ సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ కార్యకర్తలకు, అభిమానులకు అభివాదం చేసుకుంటూ ప్రియాంక, రాహుల్ ముందుకుసాగారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ర్యాలీలో రాహుల్, ప్రియాంక ఉత్సాహంగా కనిపించారు. మధ్యలో కాంగ్రెస్ శ్రేణులకు రాహుల్ ఫ్లయింగ్ కిస్ ఇచ్చారు. అలాగే రాహుల్, ప్రియాంక తన ర్యాలీ దృశ్యాలను స్వయంగా ఫోన్‌లో చిత్రీకరించారు. ర్యాలీకి ముందు పార్టీ నాయకుల సమక్షంలో ప్రియాంక గాంధీ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ర్యాలీ తర్వాత పార్టీ కార్యకర్తలు, అభిమానుల ను ఉద్దేశించి ప్రియాంక గాంధీ ప్రసంగించారు. వయనాడ్ ప్రజలకు సేవ చేసేందుకు తాను ఇక్కడి నుంచి పోటీచేస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ



తొలిసారి ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రచారం జరిగినా ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల తరపున ప్రచారం మాత్రమే నిర్వహించారు. వయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉప ఎన్నిక నేపథ్యంలో ఆమె ఇక్కడి నుంచి పోటీచేస్తున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్, రాయబరేలీ స్థానాల నుంచి పోటీచేయగా.. రెండు చోట్ల విజయం సాధించారు. దీంతో వయనాడ్ స్థానానికి ఆయన రాజీనామా చేశారు. దీంతో వయనాడ్ ఉప ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. నవంబర్13న ఇక్కడ పోలింగ్ జరగనుంది. 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆమె క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి ప్రియాంక గాంధీ పార్టీ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ప్రియాంక గాంధీ ఎంపీగా గెలిస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక కలిసి పార్లమెంటులో అడుగుపెట్టడం ఇదే మొదటిసారి అవుతుంది.

## సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ అణచివేత కుట్రలు

### ●ఎన్నికల ముందు కమలాహారిస్ బృందంపై దుమారం

మోర్గాన్ మెక్ స్వీనీ 'సెంటర్ ఫర్ కౌంటరింగ్ డిజిటల్ హేట్' అనే సంస్థను నడిపిస్తున్నారు. ఇంగ్లాండ్ ప్రధాని స్ట్రీమర్ కు చెందిన లేబర్ పార్టీతో ఆ కంపెనీకు సత్సంబంధాలు ఉన్నాయి. అయితే తాజాగా సీసీడీహెచ్ సంస్థకు సంబంధించిన కొన్ని పత్రాలను ది డిస్‌ఇన్ఫర్మేషన్ క్రానికల్ అనే సంస్థ బయటపెట్టింది. 2024లో రూపొందించిన డాక్యుమెంట్లలో ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని ఎక్స్ ను అణచివేయడం ఎలా అనే దానిపై స్పష్టంగా పేర్కొంది. 'కిల్ మస్క్స్ ట్విటర్' పేరుతో ఇది ఉంది. ఎక్స్‌ను ఆర్థికంగా దెబ్బతీయడం, ప్రకటనలు ఇచ్చేవారిని భయపెట్టడం వంటి సంచలన విషయాలు ఉన్నాయి. కమలా బృందం చేస్తున్న పనిపై ఎలాన్ మస్క్ స్పందిస్తూ.. ఈ ఘటన అమెరికాలో క్రిమినల్ చట్టాలను ఉల్లంఘిస్తూ ఎన్నికల్లో జోక్యం చేసుకొనేలా ఉందని, సీసీడీహెచ్ దాని దాతలపై పోరాడతామని చెప్పారు. రిపబ్లికన్ల తరఫున అధ్యక్ష అభ్యర్థిగా బరిలో నిలిచిన డొనాల్డ్ ట్రంప్‌పై కాల్పుల తర్వాత ఎలాన్ మస్క్ ఆయనకు అండగా నిలిచిన విషయం తెలిసిందే. ట్రంప్‌ను ఉద్దేశించి మస్క్ ఓ కార్యక్రమంలో కూడా ప్రసంగించారు. పని ఒత్తిడి, అధిక పని గంటలతో శారీరకంగా, మానసికంగా కుంగిపోయి ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి. ఇలాంటి సమయంలో వారానికి 100 గంటలు పని చేస్తేనే వేగంగా విజయాన్ని పొందొచ్చని ఎలాన్ మస్క్ అభిప్రాయపడ్డారు. 'మీరు వారానికి 100 గంటలు పనిచేస్తే ఇతరులు 50 గంటలు పనిచేసిన దానికంటే రెట్టింపు ఫలితం సాధిస్తారు. నేను, నా సోదరుడు రాత్రుళ్లు కోడింగ్ చేసేవాళ్లం' అని తెలిపారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువత వారానికి 70 గంటల పాటు పనిచేయాలని ఇన్ఫోసిస్ సీఈవో నారాయణ మూర్తి అప్పట్లో చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. పని గంటలను పరిస్థితులకు తగ్గట్టు సవరించుకోకపోతే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడలేమని అభిప్రాయపడ్డారు. 'దేశ యువతను విజ్ఞప్తి చేస్తున్నా. ఇది నా దేశం. నా దేశం కోసం వారానికి 70 గంటల పాటు పని చేసేందుకు నేను సిద్ధం అంటూ యువత కూడా నాతో పాటు ముందుకు రావాలని నారాయణ మూర్తి పిలుపునిచ్చారు. ఈ కామెంట్స్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

## దీపావళి నుంచి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

100 సీట్లకు పెంచుతూ నిర్ణయం తీసుకుందని పార్థసారథి తెలిపారు. ఇందులో 25 టీచింగ్ పోస్టులకు, 58 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేసిందన్నారు. మంగళగిరిలో 30 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మారుస్తూ మంత్రి వర్గం తెలిపిందని మంత్రి వివరించారు. ప్రతి నియోజకవర్గంలో వంద పడకల ఆసుపత్రిని నిర్మించేందుకు గ్రీన్ సిగ్నల్ తెలిపిందని వెల్లడించారు. ముఖ్యంగా సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీల మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని ఈనెల 31 దీపావళి రోజు నుంచి పండుగ వాతావరణంలో ప్రారంభి స్తున్నట్లు మంత్రి మనోహర్ వెల్లడించారు. మూడు సిలిండర్ల పంపిణీ షెడ్యూల్‌ను ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి జులైలో మొదటి గ్యాస్ సిలిండర్, ఆగస్టు నుంచి నవంబర్ వరకు రెండో గ్యాస్ సిలిండర్, డిసెంబర్ నుంచి మార్చి మధ్య వరకు మూడో గ్యాస్ సిలిండర్‌ను పొందవచ్చని పేర్కొన్నారు. సిలిండర్ డెలివరీ అయిన 48 గంటల్లో డీబీటీ పద్ధతిలో వినియోగదారుడి అకౌంట్‌లో డబ్బులు జమ అవుతాయని వివరించారు. గ్యాస్ సిలిండర్ సమస్యలను పరిష్కరించేందుకు గాను గ్రామ, వార్డు సచివాలయంలో ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ పథకానికి ప్రతి యేడాది రూ. 2, 684 కోట్లు వ్యయం అవుతుందని, పేద మహిళలకు దీపావళి కానుకగా ప్రకటించినందుకు మహిళల తరుపున మంత్రి అనిత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.ఆలయ కమిటీల్లో బ్రాహ్మణులు, నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించేందుకు, సభ్యుల సంఖ్య పెంచే చట్ట సవరణకు కేబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖకు చెందిన వివాదాస్పద పీఠాధిపతి స్వరూపానందేంద్రకు చెందిన శారదాపీఠానికి జగన్ ప్రభుత్వం అప్పనంగా కట్టబెట్టిన 15 ఎకరాల అత్యంత విలువైన భూమిని వెనక్కి తీసుకోవాలనే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన గురువు, అత్యంత సన్నిహితుడైన స్వరూపానందేంద్ర కోరిందే తడవుగా.. భీమిలి పట్టణాన్ని ఆనుకుని కొత్తవలస గ్రామ పరిధిలో, సముద్ర తీరానికి దగ్గర్లో రూ.కోట్ల విలువ చేసే భూమిని ఎకరం రూ.లక్ష చొప్పున అడ్డగోలుగా ఇచ్చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమ భూ కేటాయింపులపై సమీక్షలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం దీన్ని గుర్తించింది. శారదాపీఠానికి భూముల కేటాయింపును రద్దు చేయాలని నిర్ణయించింది.

## నాంపల్లి కోర్టుకు హాజరైన కెటిఆర్

ఆమె ఈ తరహా వాఖ్యలు చేసిందని కోర్టుకు కేటీఆర్ విన్నవించారు. ఈ కేసుకు సంబంధించిన అన్ని ఆధారాలను సమర్పించినట్లు కోర్టుకు తెలిపారు. ఆ క్రమంలో యూట్యూబ్ లింక్స్‌తోపాటు పేపర్ స్టేట్‌మెంట్స్ సైతం కోర్టుకు ఇచ్చానని ఈ సందర్భంగా కేటీఆర్ చెప్పారు. ఈ నేపథ్యంలో చట్ట ప్రకారం మంత్రి కొండ సురేఖపై చర్యలు తీసుకోవాలని కోర్టుకు ఆయన కోరారు. కేటీఆర్ వ్యాఖ్యలపై కోర్టు స్పందించింది. మంత్రి కొండ సురేఖ ఏమి వాఖ్యలు చేసిందని కేటీఆర్‌ను ప్రశ్నించింది. దీంతో ఫిర్యాదు కాపీలో వివరాలన్నీ సమగ్రంగా ఉన్నాయని కోర్టుకు కేటీఆర్ తరపు న్యాయవాది తెలిపారు. దీంతో వాటినే ప్రామాణికంగా తీసుకోవాలా? లేకుంటే స్టేట్మెంట్ ఇస్తారా? అని కోర్టు మళ్లీ ప్రశ్నించింది. ఆ వెంటనే మాజీ మంత్రి కేటీఆర్ స్పందిస్తూ.. మంత్రి కొండ సురేఖ చేసిన వ్యాఖ్యలు చాలా అసహ్యంగా ఉన్నాయన్నారు. ఆ వివరాలు చెప్పమంటే చెప్తానని కోర్టుకు కేటీఆర్ తెలిపారు. హీరో నాగ చైతన్య, హీరోయిన్ సమంతా విడాకుల అంశంలో తెలంగాణ మంత్రి కొండా సురేఖ తనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. ఆమెపై చర్యలు తీసుకోవాలంటూ నాంపల్లి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ బుధవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. అయితే ఈ కేసులో మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ రూ. 100 కోట్ల పరువు నష్టం దావా వేసిన సంగతి తెలిసిందే. నాగ చైతన్య, సమంత విడాకులకు కారణం కేటీఆర్ అంటూ మంత్రి కొండా సురేఖ తీవ్ర వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అంతేకాకుండా.. కేటీఆర్ వల్ల చాలా మంది హీరోయిన్లు.. త్వరగా పెళ్లి చేసుకుని జీవితంలో స్థిరపడిపోయారన్నారు. కొండ సురేఖ చేసిన ఈ వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. దీంతో టాలీవుడ్ ప్రముఖులు సైతం స్పందించారు. కొండా సురేఖ వ్యాఖ్యలను ఖండించారు. ఇక టాలీవుడ్ హీరో అక్కినేని నాగార్జున సైతం మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యలపై నాంపల్లి ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. మరోవైపు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు మంత్రి కొండ సురేఖ మీడియా ముందు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుపై ఆందోళన

ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్నారు. నల్లగొండలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను నకిరేకల్‌లో అడ్డుకుని అదుపులోకి తీసుకున్నారు. ఇక మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిశోర్, రవీంద్రకుమార్ నాయక్‌లను గృహ నిర్బంధంలో ఉంచారు. రామన్నపేటలో గతంలో లాజిస్టిక్ పార్కు, డ్రైపోర్టు కోసం రైతుల నుంచి కొనుగోలు చేసిన భూముల్లో కాలుష్య కారక సిమెంట్ కంపెనీ ఏర్పాటుకు అదాని చర్యలు ప్రారంభించారు. 65.5 ఎకరాల్లో కంపెనీ స్థాపనకు రూ.1,400 కోట్లు ఖర్చు చేయనున్నారు. స్టాండ్ అలోన్ సిమెంట్ గ్రైండింగ్ యూనిట్‌లో ఏటా 6.0 ఎంఎంటీపీఏ సిమెంట్ ఉత్పత్తికి ప్రతిపాదనలు చేశారు. ఈ నెల 23న ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నారు. సిమెంట్ పరిశ్రమను వ్యతిరేకిస్తున్న ప్రజలు ప్రభుత్వం, అదానీని తప్పు బడుతూ పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నారు. పరిశ్రమ స్థాపన నిర్ణయాన్ని ఉపసహించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




## రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి

### వైసిపి పాలనలో మహిళలకు భరోసా ఇచ్చాం

### దిశ యాప్ అందుబాటులోకి తెచ్చాం

### సహానా కుటుంబానన్ని పరామర్శించిన జగన్

గుంటూరు,అక్టోబర్ 23(ప్రజా మంటలు): ప్రేమోన్మాది చేతిలో దాడికి గురై ప్రాణాలు కోల్పోయిన సహాన కుటుంబసభ్యులకు మాజీ సీఎం వైఎస్ జగన్ పరామర్శించారు. బుధవారం ఉదయం తాడేపల్లి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు వెళ్లిన జగన్.. ముందుగా మార్చురీలో సహాన మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం సహాన కుటుంబ కుటుంబసభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్సార్సీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దిగజారిపోయిందన్నారు. ఒక దళిత చెల్లి బలైపోయిందని విమర్శించారు. వైసీపీ పాలనలో మహిళలకు భరోసా ఇచ్చామని.. దిశ యాప్ అందుబాటులోకి తెచ్చామని చెప్పుకొచ్చారు. ఎస్ఓఎస్ బటన్ నొక్కిన వెంటనే పోలీసులను పంపించే వాళ్ళమన్నారు. చేసిన వాడు మన వాడైతే ఏం చేసినా పర్వాలేదు అన్న సంకేతాలు పంపుతున్నారని విమర్శించారు. గుంటూరులో దయనీయమైన ఘటన జరిగిందని... ప్రభుత్వం ఏ విధంగా స్పందించిందో చూశామన్నారు. సీఎం చంద్రబాబుతో నిందితుడు దిగిన ఫోటోలు ఉన్నాయన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం ధర్మం పాటించాలన్నారు. బ్రెయిన్ డెడ్ అయిన తర్వాత బాధితురాలిని ఆసుపత్రిలో చేర్చారని.. ప్రభుత్వం నుంచి ఎవరూ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేవలం టీడీపీకి చెందిన యువకుడు కావడంతోనే ప్రభుత్వం స్పందించ లేదని విమర్శించారు. రెడ్ బుక్ పాలనలో పోలీసులు నిమగ్నమయ్యారని వ్యాఖ్యలు చేశారు. అత్యాచారాలను అరికట్టలేకపోయారన్నారు. చంద్రబాబు పాలనలోకి వచ్చిన మూడు నెలల్లో 77 మందిపై అత్యాచారాలు జరిగాయని.. ఏడు మంది హత్యకు గురయ్యారని తెలిపారు. ప్రభుత్వం ఏమైనా పట్టించుకుంటుందా అంటూ మండిపడ్డారు. రెడ్ బుక్ పాలనలో ఏమైనా చేయండి వెనకేసుకొస్తామని చంద్రబాబు అంటున్నారన్నారు. ఫోక్సో కోర్టులు, మహిళా కోర్టులు ఏర్పాటు చేశామని.. దిశ వాహనాలను ఇచ్చామని వెల్లడించారు. పథకాలన్నీ ఎత్తి వేశారని.. మహిళలను మోసం చేశారని మండిపడ్డారు. మహిళలు బ్రతకడానికి ఇబ్బంది పడే స్థితికి తీసుకొచ్చారని అన్నారు. తాము వచ్చిన తర్వాత ఏరి ఏరి నిందితులను పట్టుకుని జైలులో పెట్టిస్తామని స్పష్టం చేశారు. తప్పు జరిగిందని ఒప్పుకొని దర్యాప్తు చేయాలన్నారు. ప్రభుత్వం రాజకీయం చేస్తోందని జగన్ విమర్శించారు.





## ఎపిపిఎస్సీ చైర్‌పర్సన్‌గా అనూరాధ

### మాజీ ఐపిఎస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి,అక్టోబర్ 23 (ప్రజా మంటలు): రాష్ట్ర ప్రభుత్వం ఏపీపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా మాజీ ఐపీఎస్ అధికారి అనూరాధను బుధవారం నియమించింది. అనురాధను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె ఇప్పటి వరకు రాష్ట్రంలో వివిధ హోదాల్లో పని చేశారు. ఈ మేరకు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదంతో అనురాధను నియమిస్తూ సీఎస్ నీరభ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్, హోంశాఖ కార్యదర్శిగా అనురాధ కీలక బాధ్యతలు నిర్వహించారు. ఏపీపీఎస్సీ బాధ్యతల్ని గాడిన పెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం ఆ పనిని సమర్థంగా, నిష్పాక్షికంగా నిర్వహించే అధికారుల కోసం జల్లెడ పట్టింది. ఈ మేరకు ఏపీ క్యాడర్‌కు చెందిన అనురాధను నియమించింది. ఏఆర్ అనురాధ ఏపీలో ఇంటెలిజెన్స్ విభాగానికి అధిపతిగా పనిచేసిన మొదటి మహిళా ఐపీఎస్ అధికారిగా గుర్తింపు పొందారు. డీజీ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగంలో కూడా ఆమె పనిచేశారు.ఉమ్మడి ఏపీలో వివిధ జిల్లాలకుగానూ ఎస్పీగా, ఐజీగా పనిచేశారు. ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. అనురాధ నియామకం పట్ల సానుకూలంగా ఉండటంతో ప్రభుత్వం ఆమెనే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారం కోల్పోయాక ఏపీపీఎస్సీ ఛైర్మన్ గౌతమ్ సవాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్స్ పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయని టీడీపీ అప్పట్లో తీవ్ర ఆరోపణలు చేసింది. అయితే ప్రభుత్వం మారినా.. గౌతమ్ సవాంగ్ పదవీ కాలం మరో ఏడాదిపాటు గడువు ఉంది. అయినప్పటికీ ఆయన తన పదవికి రాజీనామా చేశారు.




## ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచం ఏకతాటిపై నిలవాలి

### ద్వంద్వ ప్రమాణాలు మంచివి కావు

### పరోక్షంగా చైనాను ఉద్దేశించి మోడీ వ్యాఖ్యలు

మాస్కో,అక్టోబర్ 23 (ప్రజా మంటలు): ఉగ్రవాదంపై పోరుకు యావత్ ప్రపంచం ఏకతాటిపై నిలవాలని భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. దీనిపై ద్వంద్వ ప్రమాణాలకు తావీయరాదని పరోక్షంగా చైనా తీరును ఎండగట్టారు. కజాన్‌లో జరుగుతున్న 16వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో మోదీ మాట్లాడుతూ, ఉగ్రవాదం అనే తీవ్ర సమస్యను కలిసికట్టుగానే ఎదుర్కోవలసి ఉంటుందన్నారు. ఇలాంటి అంశాల్లో ద్వంద్వ ప్రమాణాలు సరికాదన్నారు. ఉగ్రవాదం, ఉగ్రవాదులకు నిధుల సరఫరా అనేవి చాలా తీవ్రమైన సమస్యలు. వీటిని చాలా సమర్థవంతంగా ఎదుర్కోవాలి. ఇందుకు అంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని మోదీ సూచించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర నేరుగా ఏ దేశం పేరును ప్రస్తావించకపోయినప్పటికీ ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్థాన్‌కు చైనా ఆర్థిక సహాయాన్ని ఎండగట్టారు. ప్రపంచ శాంతికి విఘాతం కలిగించే రాడికలైజేషన్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. యువతను అతివాదులుగా మారేందుకు ప్రేరేపించడాన్ని



సమష్టిగా ప్రపంచదేశాలు అడ్డుకోవాలని అన్నారు. అంతర్జాతీయ తీవ్రవాదంపై యూఎన్ కాంప్రహెన్సివ్ కన్వెన్షన్‌లో ప్రస్తావించిన పెండింగ్ అంశాలపై కూడా అంతా కలిసికట్టుగా పనిచేయాలని సభ్యదేశాలకు మోదీ పిలుపునిచ్చారు.



# తిరుమలలో టిక్కెట్ల దందా వ్యవహారం

## కలకలం రేపుతున్న దళారీల దందా

తిరుమల, అక్టోబర్ 23 (ప్రజా మంటలు):

తిరుమల వీఐపీ బ్రేక్ దర్శనం టికెట్ల దుర్వినియోగం తీవ్ర వివాదా స్పదమైంది. బ్లాక్‌లో వీఐపీ దర్శన టికెట్లు అమ్ముకుంటున్నారని ఇప్పటికే తీవ్ర విమర్శలు వ్యక్తమవు తున్నాయి.. ఇప్పటికే.. పలువురు ప్రజాప్రతినిధుల పేరిట విఐపి బ్రేక్ దర్శనం ఇప్పిస్తామని.. దళారులు భక్తుల నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ పోలీసులకు చిక్కిన విషయం తెలిసిందే.. ఇటీవల ఇదే విషయంలో ఏపీకి చెందిన ఓ ఎమ్మెల్సీ పై కూడా కేసు నమోదైంది.. బ్రేక్ టికెట్ల పేరిట డబ్బులు వసూలు చేసినట్లు ఆమెపై కేసు నమోదైంది. ఈ తరుణంలోనే ఓ రాష్ట్రానికి చెందిన సీఎం పేరుతో ఏకంగా.. ఆయన లెటర్ హెడ్ తో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను అమ్మేందుకు ప్రయత్నించి ఓ దళారీ అడ్డంగా బుక్కయ్యాడు. పాండిచ్చేరి సీఎం లేఖ ద్వారా విఐపి బ్రేక్ దర్శనం టికెట్లను ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేస్తున్న దళారికి తిరుమల పోలీసులు అతనికి దిమ్మతిరిగేలా చెక్ పెట్టారు. పుదుచ్చేరి సీఎం లేఖ ద్వారా వీఐపీ బ్రేక్ టికెట్లను విక్రయిస్తుండగా దళారీ బద్మనాభం అలియాస్ భరత్ ను తిరుమల టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మనాభం ఈ నెల 21 న నెల్లూరుకు చెందిన ఐదుగురు భక్తులకు విఐపి బ్రేక్ దర్శనం ఇప్పిస్తానని రూ. 23 వేలు తీసుకున్నాడు.. విఐపి దర్శనం టికెట్స్ కాకుండా రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను ఇప్పించాడు. విఐపి దర్శనం టికెట్లు రాకపోవడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని నెల్లూరుకు చెందిన భక్తుడు విజయ్ కుమార్.. డిమాండ్ చేశారు. డబ్బులు తిరిగి ఇచ్చేందుకు బద్మనాభం నిరాకరించడంతో విజయ్ కుమార్ టిటిడి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.. ఈ మేరకు భక్తుడు తిరుమల టూ టౌన్ పిఎస్ లో ఫిర్యాదు చేశాడు.. దీంతో అతని స్టేట్‌మెంట్‌ను విజిలెన్స్ ఇన్స్పెక్టర్ శంకర్ బాబు రికార్డ్ చేశారు.. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలాఉంటే.. బ్రేక్ దర్శనం టికెట్లు విక్రయించిన విషయంలో ఇటీవల ఏపీకి చెందిన ఎమ్మెల్సీ జకియా ఖానంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎమ్మెల్సీ సిఫార్సు లేఖపై 6 టికెట్లు భక్తులు పొందినట్లు ఫిర్యాదు చేశారు. ఒక్కో టికెట్‌కు 10వేల రూపాయలు భక్తుల నుంచి తీసుకున్నట్లు చెప్పడంతో.. ఆమెపై పోలీసులు కేసు నమోదు చేశారు.. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే.. పాండిచ్చేరి సీఎం లేఖ తో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లను విక్రయించడం కలకలం రేపుతోంది.

# శ్రీవారిని దర్శించుకున్న సీతక్క

## పండితుల వేదాశీర్వచనం

తిరుమల, అక్టోబర్ 23 (ప్రజా మంటలు):



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మంత్రి సీతక్క దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతో పాటు వరంగ్ మేయర్ గుండు సుధారాణి కూడా ఉన్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆలయ పండితులు మంత్రి సీతక్కు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పని ఒత్తిడి వల్ల మొక్కులు చెల్లించుకోవడం ఆలస్యమైందని చెప్పారు. వయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలవాలని కోరుకున్నట్లు తెలిపారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కాగా, తిరుమలలో తెలంగాణకు చెందిన ప్రజాప్రతినిధులపై టీటీడీ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంటక్ ఆరోపించారు. సోమవారం ఇరువురు నేతలు కలిసి తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. అయితే తిరుమలలో తమకు సరైన గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు భద్రాచలం, యాదాద్రి ఆలయానికి వచ్చినప్పుడు వారికి ప్రొటోకాల్ అమలవుతోందన్నారు. కానీ తెలంగాణ ఎమ్మెల్యేలపై తిరుమలలో ఎందుకు చిన్నచూపు అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజా ప్రతినిధులు సిఫార్సు చేస్తే కనీసం గదులు కూడా ఇవ్వరా అని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ప్రశ్నించారు. ఏపీ సీఎం చంద్రబాబు మాత్రం తనకు తెలుగు రాష్ట్రాలు రెండు కళ్లలాంటివని చెబుతారు, కానీ తిరుమలలో తెలంగాణ నేతల పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. టీడీపీ, వైసీపీ నేతలు తెలంగాణలో వ్యాపారాలు చేసుకోవచ్చా, ఏపీ ఎమ్మెల్యేలను రానివ్వకుండా మేం కూడా అడ్డుకోవాలా అన్నారు. తెలంగాణ ఆలయాల్లో ఏపీ ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ లేకుండా ఉండాలన్నారు. దీని కోసం వచ్చే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేస్తామని బల్మూరి వెంకట్, అనిరుధ్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ఏపీ సీఎం చంద్రబాబు తిరుమలలో తెలంగాణ ప్రజా ప్రతినిధులకు ప్రొటోకాల్, వారి సిఫార్సు లేఖలపై స్పందించాలని బల్మూరి వెంకట్ కోరిన విషయం తెలిసిందే.

# ప్రతిష్టకు భంగం కలిగించిన బండి సంజయ్

## లీగల్ నోటీసులు పంపించిన కెటిఆర్

హైదరాబాద్, (ప్రజా మంటలు):



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీస్ పంపించారు. తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరించారు. బండి సంజయ్ కామెంట్స్ నిరాధారమైనని, తనపై తప్పుడు ఆరోపణలని వెల్లడించారు. ఆయన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయన్నారు.తనను అప్రతిష్ట పాలు చేయాలన్న దురుద్దేశతంతోనే ఆయన కామెంట్స్ చేశారని నోటీసులో కేటీఆర్ తెలిపారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అసత్య ప్రచారం చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా క్షమాపణలు చెప్పకుంటే పరువు నష్టం దావా, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ఏనుగుదాడిలో వ్యక్తి మృతి

## రామకుప్పం అటవీ ప్రాంతంలో ఘటన

చిత్తూరు, అక్టోబర్ 23 (ప్రజా మంటలు):

రామకుప్పం అటవీ సమీపంలో ఏనుగు ఓ వ్యక్తిపై దాడి చేసి తొక్కి చంపింది. ఈ ఘటన రామకుప్పం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా రామకుప్పం మండల పరిధిలోని పీఎంకే తాండా సమీపంలోని సాకలనత్తం కొండ ప్రాంతంలో గ్రామానికి చెందిన రెడ్డు నాయక్ ( 47) పై మంగళవారం రాత్రి ఏనుగు దాడి చేయటంతో అతను మృతి చెందాడు. రెండు నెలల కిందట మృతుడి భార్య ప్రమీల ఆనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుండి తరచు మృతుడు రెడ్డు నాయక్ అటవీ సరిహద్దులోని స్మశానంలోని భార్య సమాధి వద్దకు వెళ్లి రోదించేవాడు. ఈ నేపథ్యంలో అదే ప్రాంతంలో ఆతనిపై ఏనుగు దాడి చేయటంతో మృతి చెందాడు. కాగా మృతుడికి ఓ కుమారుడు ఉన్నాడు. ఇటీవల సమీపంలోని పిఎం తాండా వద్ద జూన్ 16వ తేదీన కన్నా నాయక్ ఏనుగు దాడిలో మరణించారు. తరచు ఏనుగులు గ్రామాలపై పడి మనుషుల ప్రాణాలు తీస్తున్న? ఏనుగు దాడులకు శాశ్వత పరిష్కారం చూపటం లేదని అటవీ ప్రాంత ప్రజలు వాపోతున్నారు.

# కడప జిల్లాలో లోయలోపడ్డ బస్సు

## 25మంది ప్రయాణికులకు గాయాలు

కడప,అక్టోబర్ 23 (ప్రజా మంటలు):



వైఎస్ఆర్ జిల్లా పులివెందుల సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు 30 అడుగుల లోయలో పడింది. కదిరి నుంచి పులివెందులకు వస్తుండగా ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో 25 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కదిరి నుంచి బయల్దేరిన ఆర్టీసీ బస్సు.. పులివెందుల సమీపంలోని డంపింగ్‌యార్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేకులు వేశారు. దీంతో బస్సు స్కిడ్ అయి చెట్లను తాకుతూ పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. క్షతగాత్రులను తెదేపా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్ పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

# నాలుగేళ్ల చిన్నారపై అత్యాచార యత్నం

## నిందితుడిపై ఫోక్సో చట్టం నమోదు

హైదరాబాద్, (ప్రజా మంటలు):



దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భౌరంపేటలో ఈనెల 12న నాలుగేళ్ల చిన్నారిపై యోగి అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత కుటుంబం మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం కింద ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరుగుతుందని, వైద్య నివేదికలు రాగానే తదుపరి చర్యలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు.ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా ఈ కేసుపై దర్యాప్తు జరిపి నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ డీసీపీ కోటిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లి తండ్రులు తమ పిల్లల్ని నిత్యం కనిపెట్టుకొని ఉండాలని వారు సూచించారు.

# గాంధీలో నీటికి కొరత లేదు

## వార్తలను కొట్టి పారేసిన సూపర్నెంట్

హైదరాబాద్,అక్టోబర్ 23 (ప్రజా మంటలు):

సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో నీటి కొరత ఉందని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాజకుమారి స్పష్టం చేశారు. నీటి సమస్యతో సర్జరీలు జరగక రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వస్తున్న వార్తలను ఆమె కొట్టిపారేశారు. ఆసుపత్రుల్లో రోగులకు సకాలంలో మంచినీరు అందిస్తున్నట్లు తెలిపారు. 20 ఏళ్ల క్రితం అమర్చిన మోటార్లు సరిగా పనిచేయకపోవడంతో వాటిని స్థానంలో ఆరు కొత్త మోటార్లను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. కొత్త మోటర్లు ఏర్పాటుచేసే క్రమంలో పాతవాటిని కాసేపు నిలిపివేయడంతో ఈ పరిస్థితి తలెత్తినట్లు చెప్పారు. పాత మోటర్ల పనితీరు సరిగా లేనందున సమస్య తలెత్తిందని, వాటి స్థానంలో కొత్త మోటార్లను అమర్చి సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. గాంధీ ఆసుపత్రికి వైద్య కోసం వచ్చే రోగులు అపోహలను నమ్మవద్దని సూచించారు.

# ఇవిఎంల ట్యాపంరింగ్ ముమ్మాటికీ నిజమే

## ఎలన్ మస్క్ లాంటి వారే ఆరోపిస్తున్నారు

## రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టలేని దుస్థితిలో చంద్రబాబు

## మాజీ ఎంపి చింతామోహన్ విమర్శలు

విజయవాడ,అక్టోబర్ 23 (ప్రజా మంటలు):



ఈవీఎం ట్యాంపరింగ్ వందశాతం జరుగుతున్నదని ఈవీఎంల వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎంపీ చింతా మోహన్ సంచలన ఆరోపణలు చేశారు. ఎలన్ మస్క్ వంటి టెక్ నిపుణులు సైతం ఈ విషయాన్ని అనేకసార్లు చెప్పారని గుర్తు చేశారు. ప్రతిపక్షాలను దెబ్బతీసేందుకు అధికార పార్టీ చేసే ప్రయోగం ఇదని వ్యాఖ్యానించారు. భాతదేశ ప్రజాస్వామ్యం నిలబడాలంటే బ్యాలెట్ పోలింగ్ విధానం కావాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి చెందిన అమెరికా వంటి దేశాల్లోనే బ్యాలెట్ ఓటింగ్ జరుగుతుందని గుర్తు చేశారాయన. బుధవారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. మితిమీరిన విశ్వాసంతోనే హర్యానాలో కాంగ్రెస్ ఓడిపోయిందన్నారు. ఇదే సమయంలో ఏపీలోని పరిస్థితులపైనా కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెక్రటేరియట్ రాజభోగంలా ఉంటే.. ఆంధ్రాలో ఐదు షెడ్‌లు వేసి సెక్రటేరియట్ అంటున్నారని ఎద్దేవా చేశారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన వ్యక్తి.. ఇప్పటికీ రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టలేకపోయారని విమర్శించారాయన. కూటమి ప్రభుత్వం 100 రోజుల్లో ఏ ఒక్క పథకం అమలు చేయలేకపోయిందన్నారు. రాష్ట్రంలో పెన్షన్లు తప్ప ఇప్పటి వరకు ఏమీ అమలు కాలేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు అంశంపైనా చింత మోహన్ షాకింగ్ కామెంట్స్ చేశారు. నలుగురు ముఖ్యమంత్రులతో పని చేసిన రిటైర్డ్ ఐఏఎస్ ప్రకారం.. పోలవరం ప్రాజెక్టు పూర్తి కాదన్నారు. ప్రపంచంలో మూడు కంపెనీలు తప్ప.. పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడం ఎవరి వల్లా కాదన్నారు. 4,000 వేల మంది గిరిజనులను ఖాళీ చేయిస్తే తప్ప పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఆటంక తొలగదన్నారు. అమరావతి పూర్తి కాలేదు కానీ.. చెన్నై నుంచి రియల్టర్లు వచ్చి అమరావతిలో భూముల ధరలను పెంచేస్తున్నారని చింతా మోహన్ ఆరోపించారు. అమరావతి నిర్మాణం పూర్తి కావాలంటే ఇంకా 100 పైనే పడుతుందన్నారు. అమరావతిలో డ్రోన్స్ ఎగువరేయడం ఏం లాభం కలిగిందని ప్రభుత్వాన్ని చింతా మోహన్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం.. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనపై దృష్టి సారించాలన్నారు. తిరుపతి లడ్డూపై అవాస్తవాలను ప్రచారం చేసి చంద్రబాబు బొక్కబోర్లా పడ్డారన్నారు. సూపర్ 6 పథకాలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు చంద్రబాబు నాంది పలుకుతున్నారని ఆరోపించారు. పేదలకు కావలసింది తక్కువ ధరలో నిత్యావసర సరుకులు, ఉపాధి కల్పన అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటే సిద్దాంతాలు కలిగిన పార్టీ అని అన్నారు. జగన్, షర్మిల మధ్య వ్యవహారం వ్యక్తిగతం అన్నారు. గత చంద్రబాబుకు ఇప్పటికీ బాబుకు చాలా తేడా ఉందన్నారు. ప్రస్తుతం చంద్రబాబు నాయుడు ఢిల్లీ పెద్దల వద్ద సాగిల పడుతున్నారని విమర్శించారు.

# మూసీ సుందరీకరణ కాదు..మురికిని నివారించండి

## పేదల ఇళ్లను కూల్చడం సరికాదు: ఈటెల

హైదరాబాద్,అక్టోబర్ 23 (ప్రజా మంటలు):



మూసీ సుందరకీకరణ పేరుతో పేదలను తరిమి వేయవద్దని మల్కాజిగిరి భాజపా ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. పేదల ఇంటిని లాక్కోవడం సరికాదన్నారు. ముందు మూసీలో మురికి చేరకుండా చూడాలన్నారు. బుధవారం సాయంత్రం చైతన్యపురి డివిజన్ పరిధిలోని మూసీ నిర్వాసితులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈటల చేసిన పోరాటం వల్లే మా ఇళ్లు ఇప్పటికీ ఉన్నాయి. అయినా, మాకు ఆందోళనగానే ఉంది. మీరే మమ్మల్ని కాపాడాలి. మూసీ సుందరీకరణ కంటే మా ఇళ్లే ముఖ్యం. సుందరీకరణ కంటే ముందు డ్రైనేజీ క్లీన్ చేయండి. సియోల్ వెళ్లిన బృందం చూపిస్తుంది కదా.. తెల్లటి నీళ్లు. ఇక్కడ కూడా అలా చేస్తే మేమే వెళ్లిపోతాం. మేం కట్టుకున్న మంచి ఇళ్లు వదిలి.. డబుల్‌బెడ్రూమ్ ఇళ్లకి ఎలా వెళ్లగలం? వీళ్లు పెట్టే టెన్షన్‌కి ఆరోగ్యాలు పాడవుతున్నాయి. రూ.కోట్లు ఇచ్చినా.. మా ప్రాణాలు పోయినా మేం ఇక్కడి నుంచి కదలం అని పలువురు నిర్వాసితులు ఈటల వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు.

# బిసి సమస్యల కోసం పార్లమెంట్ ముట్టడి

## 26న ముట్టడి కార్యక్రమం చేపడతామన్న కృష్ణయ్య



హైదరాబాద్, (ప్రజా మంటలు):

బీసీ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న బీసీలతో పార్లమెంట్‌ను ముట్టడిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు,మాజీ ఎంపీ ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. బీసీలకు సామాజిక న్యాయం చేయకపోతే కేంద్రంపై మిలిటెంట్ పోరాటం చేస్తామని ప్రకటించారు. జాతీయ బీసీ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో 13 బీసీ సంఘాలు, 30 కుల సంఘాల నాయకులతో బుధవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి, జనగణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఉవ్వెత్తున ఎగిసిన తెలంగాణ ఉద్యమం లాగా బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. జనాభా దామాషా ప్రకారం కేంద్రం బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని,అందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని కోరారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ అంటే అంబాని, ఆధాని కాదని, దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీలైన బహుజనులను బాగుచేయడమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నంద గోపాల్, ఉదయ్, నీల వెంకటేశ్, రాఘవ, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

# మరో ప్రపంచ యుద్ధాన్ని ఐరాస ఆప గలదా?



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

## మరో ప్రపంచ యుద్ధాన్ని ఐరాస నివారించాలి

## అక్టోబర్ 24... ఐక్యరాజ్య సమితి దినోత్సవం

ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ చట్టం, భద్రత, ఆర్థిక అభివృద్ధి, సామాజిక అభివృద్ధి , మానవ హక్కులపై సమష్టి కృషి చేసేందుకు ప్రపంచ దేశాలు ఏర్పాటు చేసుకున్న ఒక అంతర్జాతీయ సంస్థ. 20వ శతాబ్దం మానవాళిని అతలాకుతలం చేసింది. 1930 నాటి మహామాంద్యం వల్ల ఐరోపాలో నియంతలు అధికార పీఠాలు అధిరోహించారు. ఆపై సంభవించిన రెండో ప్రపంచ యుద్ధం, మానవాళి చరిత్రనే రక్తాక్షరాలతో లిఖించింది. అలాంటి పరిస్థితుల్లో ప్రపంచం ఎదుర్కొం టున్న సమస్యల పరిష్కారానికి ఒక బహుముఖీన అంతర్జాతీయ సంస్థ అవసరమని ప్రపంచ నాయకులు భావించారు. ఆ భావనకు ఒక రూపం కల్పించారు. తరవాత అదే ఐక్యరాజ్య సమితిగా ఆవిర్భ వించింది. నానాజాతి సమితి (లీగ్ ఆఫ్ నేషన్స్) రెండవ ప్రపంచ యుద్ధాన్ని నివారించుటలో విఫల మగుటచే దానికి ప్రత్యామ్నా యంగా 1945లో ఐక్యరాజ్య సమితి స్థాపించ బడింది.

ప్రతి సభ్య దేశమూ ఐ.రా.స. సాధారణ సభలో సభ్యత్వం కలిగి ఉంటుంది. ఐ.రా.స. చార్టర్ 2వ ఛాప్టర్ 4వ ఆర్టికిల్ ప్రకారం ఏదైనా దేశానికి ఐ.రా.స. సభ్యత్వం రావాలంటే ఐ.రా.స. భద్రతా సభ ఆమోదంపై, ఐ.రా.స. సాధారణ సభ తీర్మానం జరగాలి. నియమాల ప్రకారం సంపూర్ణ స్వాధిపత్యం ఉన్న దేశాలు మాత్రమే సభ్యత్వానికి అర్హత కలిగి ఉంటాయి. కాని ఐ.రా.స. ఏర్పాటు సమయంలో చేరిన నాలుగు ఆరంభ సభ్య దేశాలకు (బెలారస్, భారత దేశం, ఫిలిప్పీన్స్, ఉక్రెయిన్) అప్పటికి సంపూర్ణ స్వాతంత్ర్యం లేదు. అంతే కాకుండా భద్రతా సభ ఆమోదం ఉండాలన్న నిబంధన కారణంగా మాంటివిడియో కన్వెన్షన్ ప్రకారం స్వాధిపత్యం కలిగిన కొన్న దేశాలు కూడా, మరి కొన్ని ఐ.రా.స. సభ్య దేశాలు వ్యతిరేకించిన కారణంగా ఐ.రా.స. సభ్యత్వం కలిగి లేవు.

1945లో ఐ.రా.స. ఏర్పడినప్పుడు 51మంది సభ్య దేశాలున్నాయి. వాటిలో 49 దేశాలు ఇప్పటికీ సభ్యులుగా ఉన్నాయి. లేదా వారి సభ్యత్వం వేరే దేశాలకు సంక్రమిం చింది. ఉదాహరణకు సోవియట్ యూనియన్ సభ్యత్వం రష్యాకు సంక్రమించింది. ప్రస్తుతము 193 దేశాలు ఐక్యరాజ్య సమితిలో సభ్య దేశాలుగా ఉన్నాయి. ఐక్యరాజ్య సమితిలో ప్రధానంగా 6 అంగాలు ఉన్నాయి. సర్వప్రతినిధి సభలో ఐక్యరాజ్య సమితిలో ప్రవేశించిన అన్ని దేశాలకు సభ్యత్వం ఉండగా, భద్రతా మండలిలో 15 దేశాలకు మాత్రమే సభ్యత్వం ఉంటుంది. అందులో 10 దేశాలు రెండేళ్ళ కోసారి ఎన్నిక ద్వారా సభ్యత్వం పొందగా, మరో 5 దేశాలు శాశ్వత సభ్య దేశాలు. అవి: అమెరికా, రష్యా, బ్రిటన్, చైనా, ఫ్రాన్స్. ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది.

దీని ప్రస్తుత ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుట్టెర్స్. ఐక్యరాజ్య సమితి స్థాపించబడిన అక్టోబరు 24వ తేదీని ప్రతి సంవత్సరం ఐక్యరాజ్య సమితి దినోత్సవంగా పాటిస్తారు. రెండవ ప్రపంచ యుద్ధం జరుగు తున్న సమయంలోనే 1941 ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు థియోడార్ రూజ్‌వెల్ట్ , బ్రిటిష్ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్ అట్లాంటిక్ సముద్రంలో ఒక ఓడలో సమావే శమై కుదుర్చుకొన్న ఒప్పందాన్ని అట్లాంటిక్ ఛార్టర్ అంటారు. ప్రాదేశిక సమగ్రత కాపాడడం, యుద్ధభయాన్ని తొలగించడం, శాంతిని నెలకొల్పడం, నిరాయుధీ కరణ వంటి ఎనిమిది అంశాలు ఈ ఒప్పందంలో ఉన్నాయి. ఈ ఒప్పందమే తరువాత ఐక్య రాజ్య సమితి సిద్ధాంతాలకు మౌలిక సూత్రాలుగా గుర్తింపు పొందినది.



తరువాత 1944లో వాషింగ్టన్ లోని డంబార్టన్ ఓక్స్ వద్ద జరిగిన సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా ప్రతినిధులు ఐ.రా.స. ప్రకటన పత్రం ముసాయిదాను తయారు చేశారు. 1945 ఫిబ్రవరిలో యాల్టా సమావేశంలో అమెరికా, బ్రిటన్, రష్యా నేతలు ప్రపంచ శాంతి పరిరక్షణ కోసం ఒక అంతర్జాతీయ సంస్థను స్థాపించాలని తీర్మానం చేశారు. శాన్ ఫ్రాన్సిస్కో నగరంలో 1945 ఏప్రిల్ 25నుండి జూన్ 26 వరకు జరిగిన అంతర్జాతీయ సమా వేశంలో 51 దేశాల ప్రతినిధులు పాల్గొని ఐక్య రాజ్య సమితి ఛార్టర్‌పై సంతకాలు చేశారు. 1945 అక్టోబరు 24న న్యూయార్క్ నగరంలో ఐక్య రాజ్య సమితి లాంఛనంగా ప్రారంభమైంది.

యుద్ధాలు జరగకుండా చూడటం, అంతర్జాతీయ తగాదాలను శాంతి యుతంగా పరిష్కరించడం, దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం, అంతర్జాతీయ బాధ్యతలను అన్ని దేశాలు గౌరవించేటట్లు చేయడం, సాంఘిక అభివృద్ధి సాధించి, మానవ జీవితాలను సుఖమయం చేయడం తదితరాలు సమితి ఆశయాలు.

అప్పటి అమెరికా అధ్యక్షుడు ఫ్రాంక్లిన్ రూజ్‌వెల్ట్ 'యునెటైడ్ నేషన్స్' అనే పదాన్ని తొలిసారి ప్రవేశ పెట్టాడు. ఐరాస పతాకాన్ని 1947 అక్టోబరు 20న ఆమోదించారు. ఈ పతాకం లేత నీలం, తెలుపు రంగుల్లో ఉంటుంది. పతాకం మధ్యలో ఐరాస చిహ్నా మైన ప్రపంచ పటం రెండు ఆలివ్ కొమ్మల మధ్య ఉంటుంది. ఆలివ్ కొమ్మలు శాంతికి చిహ్నం. ఐరాసకు ఆరు అధికారిక భాషలున్నాయి అవి చైనీస్, ఇంగ్లిష్, ఫ్రెంచ్, రష్యన్, స్పానిష్, అరబిక్. ఐక్యరాజ్య సమితికి 6 ప్రధానాంగాలు ఉన్నాయి.

సర్వ ప్రతినిధి సభ: సభలో సభ్యదేశాలన్నింటికీ ప్రాతినిధ్యం ఉంటుంది. ప్రతి దేశానికి సమానంగా ఒక్క ఓటు ఉంటుంది. సమావేశాలకు ప్రతి సభ్యదేశం గరిష్ఠంగా 5 గురు సభ్యులను పంపవచ్చు. ఈ సభ సంవత్సరానికి ఒక పర్యాయం, సాధారణంగా సెప్టెంబరు మాసంలో, సమావేశ మౌతుంది.

భద్రతా మండలి: సమితి ప్రారంభమయ్యేనాటికి ఇందులో సభ్యదేశాల సంఖ్య 11. ప్రస్తుతం 15 సభ్యదేశాలు ఉన్నాయి. అందులో 5 శాశ్వత సభ్యదేశాలు కాగా 10 రెండేళ్ళ కాలవ్యవధి కొరకు ఎన్నిక కాబడు తాత్కాలిక సభ్యదేశాలు. అమెరికా, రష్యా, ఇంగ్లాండు, చైనా, ఫ్రాన్సులు ఇందులో శాశ్వత సభ్యదేశాలు. ఈ శాశ్వత సభ్యదేశాలకు వీటో అధికారం కూడా ఉంది.

సచివాలయం: ఇది ఐ.రా.స. వ్యవహారాలు నిర్వహించే కార్యనిర్వాహక విభాగం. దీని ప్రధాన కార్యాలయం న్యూయార్క్ నగరంలో ఉంది. ఇందులో పది వేలకు పైగా ఉద్యోగులు పనిచేస్తారు. సచివాలయానికి ప్రధానాధికారిని సెక్రటరీ జనరల్ అంటారు.ధర్మకర్తృత్వ మండలి: కొన్ని పాశ్చాత్య దేశాల వలస పాలన క్రింద కొనసాగిన భూభాగాల ప్రయోజనాలను కాపాడడం ఈ మండలి లక్ష్యం. ఇక్కడి ప్రజలను స్వీయ ప్రతిపత్తికి లేదా స్వయం పాలనకు లేదా స్వాతంత్ర్యానికి సిద్ధం చేయడం ఈ మండలి బాధ్యత. ఆర్థిక, సాంఘిక మండలి: ఇది సాధారణ సభ అధ్వర్యంలో పనిచేస్తుంది. ఇందులో 54 మంది సభ్యులుంటారు. ప్రజల జీవన స్థాయిని మెరుగు పరచడం, విద్య, సాంస్కృతిక, ఆరోగ్య రంగాలలో అంతర్జాతీయ సహకారానికి కృషి చేయడం, మానవ హక్కులను సమర్థించడం వంటివి ఈ మండలి ఆశయాలు.

అంతర్జాతీయ న్యాయస్థానం: ఇది "ప్రపంచ న్యాయస్థానం"గా పిలువ బడుతుంది. ఐక్యరాజ్య సమితి యొక్క ప్రాథమిక తీర్పులను ప్రకటించే అంగము. దీని కేంద్రం నెదర్లాండ్ లోని హేగ్ నగరంలోగల, శాంతి సౌధంలో యున్నది. అంతర్జాతీయ న్యాయస్థానంలో న్యాయమూర్తి పదవిని నలుగురు భారతీయులు చేపట్టారు.

1.బెనగళ్ నరసింగరావు, 2. కె.నాగేంద్రసింగ్, . రఘునందన్ స్వరూప్ పాఠక్, 4. దల్వీర్ భండారీ (ప్రస్తుతం కొనసాగుతున్నారు.)

ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థలు...ఆహార , వ్యవసాయ సంస్థబీ అంతర్జాతీయ కార్మిక సంస్థబీ ప్రపంచ ఆరోగ్య సంస్థబీ ఐక్య రాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్‌బీ విశ్వ తపాలా సంఘం - యూనివర్సల్ పోస్టల్ యూనియన్‌బీ ప్రపంచ వాతావరణ సంస్థబీ అంతర్జాతీయ అణుశక్తి సంస్థబీ ఐక్య రాజ్య సమితి వాణిజ్య అభివృద్ధి సదస్సుబీ అంతర్జాతీయ టెలికమ్యూనికేషన్ యూనియన్‌బీ అంతర్జాతీయ పునర్వ్యవస్థీకరణ, అభివృద్ధి బ్యాంకు లేదా ప్రపంచ బ్యాంకుబీ అంతర్జాతీయ ద్రవ్య నిధి - ఐ.ఎమ్.ఎఫ్. ఉన్నాయి. ఐక్యరాజ్య సమితి స్థాపించిన నాటి నుండి నేటి వరకు 76 సంవత్సరాల కాలంలో ప్రపంచ శాంతికి దోహదం చేసే ఎన్నో కార్యకలాపాలను నిర్వహించింది. ఐతే ప్రపంచాన్ని వణికిస్తున్న తీవ్రవాదాన్ని నివారించడంలో సమితి విఫలం అయ్యింది. ఐక్యరాజ్య సమితిలోని అగ్ర రాజ్యాల ఆధిపత్యం కొనసాగు తుండటం చిన్న దేశాలకు శాపంగా మారుతున్నది. అగ్ర రాజ్యాల చేతిలో ఉన్న ఐరాస తన లక్ష్యాలను నెరవేర్చలేక పోతున్నది. కాలం గడుస్తున్న కొద్దీ ఐరాస బలహీన పడుతున్నదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. 76 ఏళ్ళ పాటు ప్రపంచ శాంతికి అవిరళమైన కృషి చేసిన ఐరాస మరో ప్రపంచ యుద్ధం రాకుండా చూసి, మానవాళిని కాపాడ గలదని మనసారా ఆశిద్దాం.

# జగిత్యాల రాజకీయాలలో అనూహ్య మార్పులకు నాంది

## ఎటూ తేల్చుకోలేని స్థితిలో జీవన రెడ్డి - చాపకింది నీరులా కాంగ్రెస్ లో బిఆర్ఎస్ వ్యవహారం

(సిహెచ్ వి ప్రభాకర్ రావు, సీనియర్ జర్నలిస్ట్)

జగిత్యాల రాజకీయాలలో కాంగ్రెస్ నేత మారు గంగారెడ్డి అనూహ్యమైన మార్పులకు శ్రీకారం చుట్టనుందని, తలపండిన రాజకీయ నాయకుడు, జగిత్యాల రాజకీయాలలో కురువృద్ధుని లాంటి తాటిపర్తి జీవన్ రెడ్డి జీవితంలో అనుకోని మలుపులకు, మార్పుకు నాంది కానుందా అని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇంత పెద్ద కుదుపును ఆయన 40 ఏళ్ల తరువాత తట్టుకోవాల్సిన పరిసతీలు ఏర్పడ్డాయి.

సామాజిక ఉద్యమాల నేపథ్యంలో, యువ న్యాయవాదిగా ఉంటూ, 1981 లో జరిగిన పంచాయత్ సమితి ఎన్నికల్లో మల్యాల నుండి సమితి అధ్యక్షునిగా ప్రత్యక్ష ఎన్నికల్లో గెలిచి, రెండేళ్ల లోపే 1982-83 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా జగిత్యాల నుండి గెలిచిన జీవన్ రెడ్డి, అనుకోని పరిస్థితులలో 1984 డిసెంబర్ లో కాంగ్రెస్ పార్టీలో చేరి, అప్పటి నుండి జగిత్యాల నుండి 6 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కాంగ్రెస్ పార్టీలో, ప్రస్తుత జగిత్యాల జిల్లాలో తిరుగులేని నాయకునిగా చలామణి అవుతున్న జీవన రెడ్డికి, ఆయన పైనే రెండుసార్లు గెలిచిన బి ఆర్ ఎస్ అభ్యర్థి డా. సంజయ్ కుమార్ కాంగ్రెస్ లో చేరడం, దానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వత్తాసు పలకడం, జీవన్ రెడ్డి ఆహాన్ని, ఆధిపత్యాన్ని కూకటివెళ్లతో పేకిలించి వేసిందనే చెప్పవచ్చు.

డిల్లీ వరకు వెళ్ళినా, సీనియర్లు ఎంత మంది చెప్పినా, ఎమ్మెల్యేను కాంగ్రెస్ పార్టీ కాదనలేక, ఆయనకే అధిక ప్రాధాన్యత ఇవ్వడాన్ని జీర్ణించుకోలేని జీవన రెడ్డికి, ఆయన సహచరుడు, ఆత్మీయుడు మార గంగారెడ్డి హత్య, అదీ, మొన్నటి వరకు బి ఆర్ ఎస్ పార్టీలో ఉన్న ఒక యువకుని చేతిలో హత్యకు గురికావడం, ఆయనకు కొలుకొని దెబ్బగా చెప్పుకొంటున్నారు. గంగారెడ్డి హత్య జరిగి రెండు రోజులైనా, ఆయన కొలుకోలేకపోతున్నారు. విషణ్ణ వదనంతో ఉన్న ఆయనను చూసిన ఎవరికైనా ఆయన ఎంతగా క్రుంగిపోయారో ఇట్టే పసికట్ట వచ్చు.

ఆయన ఎంత ఆవేశంగా ఉన్నా, ఎన్ని ఆరోపణలు చేసినా, ఎవరిని విమర్శించినా, కాంగ్రెస్ అధిష్టాన వర్గంలో కదలిక రావడం లేదు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఓదార్చడానికి ఫోన్ చేసినా, హైదరాబాద్ లో విలేఖరులు అడిగిన ఒక ప్రశ్నకు జవాబిస్తూ, జీవన్ రెడ్డి నిన్న మీ పార్టీకొా దండం ౨ ,నీకో దండం .. పార్టీలో ఉండాలా వద్దా .. అంటూ చేసిన విమర్శలు అన్నీ ఆయన వ్యక్తిగతమని కొట్టి పారేశారు. మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎంపి మధు యాష్కీ లాంటి వారు కొంత సీరియస్ గా తీసుకొన్నా, దానిపై ఎలాంటి రచ్చ చేసే పరిస్థితిలో లేరనే తెలుస్తుంది.

అంతంత మాత్రమే ఆధిక్యంతో శాసన సభ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ, గతంలో బిఆర్ఎస్ చేసినట్లుగా, మొత్తం పార్టీని తనలో కలుపుకోవాలని చేసిన ప్రయత్నంలో 10 మంది మాత్రమే కాంగ్రెస్ లో చేరడం, అందులో కూడా చేరిన కొందరు కూడా తమకు ప్రాధాన్యత లభించడం లేదని కినుకు వహించి, దూరం - దూరంగా నే ఉంటున్నారు. దీనికి తోడు, బి ఆర్ ఎస్ పార్టీ హైకోర్ట్ వీరి సభ్యత్వాన్ని రద్దు చేయాలని వేసిన పిటిషన్ వీరి తలపై కత్తిలా వేలాడుతుంది. అందులో కడియం శ్రీహరి, దానం నాగేంద్ర, తెల్లం వెంకట రావు ల పేర్లు మాత్రమే ఉన్నా, వారి పట్ల హైకోర్ట్ ఇచ్చే రేపు తెర్పే, మిగతా 7 గురు ఎమ్మెల్యేల కు వర్తిస్తుందని అనుకొంటున్నారు. సంవత్సరంలోగా, ఉప ఎన్నికలకు పోవడానికి ఎవరు కూడా సిద్దంగా లేరు.

ఈ నేపథ్యంలో, జగిత్యాలలోనే కాకుండా, అదే రోజు పఠాన్ చెరువు నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్ నాయకులపై కొత్తగా పార్టీలో చేరిన ఎమ్మెల్యే గడ్డం మహీపాల్ రెడ్డి వర్గీయులు దాడిచేయడం కూడా పార్టీలో కలకలం రేపింది. రాష్ట్ర ప్రజలను ఆకర్షించిన ఉదంతాలు ఈ రెండే అయినా, కొత్తగా పార్టీలో చేరిన బి ఆర్ ఎస్ ఎమ్మెల్యేల నియోజక వర్గాలలో పాత -కొత్త కాంగ్రెస్ కార్యకర్తల మధ్య అనేక వివాదాలు చెలరేగుతున్నాయి. ఉన్న పార్టీలోని వారే కాకుండా కొత్తగా వచ్చిన వారు, మొన్నటి వరకు అధికారం అనుభవించి, కాంగ్రెస్ కార్యకర్తలను అనేక లకు గురి ఇబ్బందులకు గురి చేసిన వారే మళ్ళీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నీళ్ళు నిండిన చేరువులోకి కప్పలు వచ్చినట్లు వచ్చి, ఆధిపత్యం చెలాయించడాన్ని పాత కాంగ్రెసన కార్యకర్తలు భరించలేకపోతున్నారు.

జగిత్యాల నియోజకవర్గంలో మొదటి నుండి ఒక సామాజిక వర్గానికి జీవన్ రెడ్డి పట్ల సానుకూలత లేదు. దాదాపు 36 సంవత్సరాల తరువాత ఆ వర్గానికి అధికారం వచ్చింది. జీవన రెడ్డి రెండవ సారి ఎమ్మెల్యేగా, వరుసగా రెండవసారి ఓడిపోవడం, అయినా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం, బి ఆర్ ఎస్ పార్టీ ఆధీనలో ఉన్న మున్సిపల్ కూడా కాంగ్రెస్ వశం అవడం కొందరికి కంటిలో నలకలా మారిపోయింది.

మొదటి నుండి అంతా తానే అయి, ఒక్కడే పార్టీని వంటి చేతితో నడిపిన జీవన్ రెడ్డి, కొత్తగా ఎమ్మెల్యే పార్టీలో చేరి ఆధిపత్యం చెలాయించడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మరో ఐదు నెలల్లో తన ఎమ్మెల్సీ పదవి కాలపరిమితి ముగిసిపోనుండగా, మళ్ళీ పోటీ చేయాలనే తపన ఉన్నా, మొన్నటి రెండు ఎన్నికల్లో ఓడిపోయిన బాధ ఆయనను ముందుకు పోకుండా చేస్తుంది. తనకంటూ ఒక వర్గం అంటూ లేని ఏకైక సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి, పెద్దగా ఆర్థిక బలం కూడా లేకపోవడంతో రాబోయే రోజుల్లో అతన్ని ఎదుర్కోవడం ఏమంత కష్టం కాదని ఒక వర్గం భావిస్తుంది.

ఎన్నడూ రాజకీయ హత్యలు, గొడవలు లేని జగిత్యాల రాజకీయాలలో మొదటిసారిగా మారు గంగారెడ్డి హత్య, నాయకులనే కాకుండా ప్రజలను కూడా ఉలిక్కిపడేట్లు చేసింది. అంతా శ్మశాన వైరాగ్యంలో ఉన్న ఈ పరిస్థితులలో, ఎమ్మెల్యే డా. సంజయ్ ఈ హత్యకు తనకు ఎలాంటి సంభందం లేదని, దీని వెనుక ఉన్నది ఎవరైనా పట్టుకొని కఠినంగా శిక్షించాలని ప్రకటించారు. అదే సమయంలో తాను ఇంకా బి ఆర్ ఎస్ లోనే ఉన్నట్లు, అభివృద్ధి కొరకే కాంగ్రెస్ తో నడుస్తున్ననే ప్రకటన చేయడం కూడా అందరినీ గందరగోళంలో పడేసింది. ఇంతకూ ఆయన ఏ పార్టీలో ఉన్నట్లు అనే ప్రశ్న తలెత్తుతుంది.

మహారాష్ట్ర, జార?ండ్ శాసన సభ ఎన్నికల నేపథ్యంలో ఈ గోడవలను కాంగ్రెస్ నేపథ్యం పట్టించుకో లేక పోవచ్చు. ఆ ఎన్నికల తర్వాత, ఈనెల 24 హైకోర్ట్ ఇచ్చే తీర్పు, ఆదేశాల మేర ఆతరువాతి కార్యక్రమం ఉండవచ్చని, కొత్తగా చేరిన వరైకి ముఖ్యమంత్రి అండ ఉండడం వల్ల సీనియర్లు అయినా వారి మాటకు అంతగా ప్రాధాన్యత లభించక పోవచ్చని, సర్దుకొమ్మని చెప్పి, ఊరడించి పంపే అవకాశాలే ఎక్కువగా ఉండవచ్చని అనుకొంటున్నారు. ఏమైనా, జగిత్యాల నియోజక వర్గంలో ప్రజాబలం ఉన్న నాయకునిగా ఎప్పటికీ నిలిచిపోయే నాయకుడు జీవన్ రెడ్డి. ఈ సంధి కాలంలో జీవన రెడ్డి లాంటి అనుభవం ఉన్న వారు మౌనంగా ఉండక తప్పదేమో. కాలమే ఇలాంటి వాటికి పరిష్కారం చూపాలి.

## నిలుపుకో బంధాలు

మనుషులను కలిపి
మనసులను దగ్గర చేసేవి
బంధాలు,అనుబంధాలు.
ఆత్మీయతానురాగాలను అందించే ఇవి

మానవజీవితాల మనుగడకు ఆవశ్యకం.
జీవనసాఫల్యానికి ఉపకరించే
సాధనాసామగ్రి కూడా ఇవే.
మనుషులను జీవింపచేసేవి,
జీవితేచ్ఛను కలిగించేవి,

ఆనందాహ్లాదాలను అనుభవింపచేసి
ఉత్తేజోత్సాహొల్లాసాల్ని
కలిగించేవి ఈ అనుబంధాలే.
వస్తువు ఉన్నప్పుడు కంటే
దాన్ని కోల్పోయినప్పుడే
తెలుస్తుంది దాని విలువ.

ఈ బంధాలూ అంతే.
వీటిని కోల్పోయాక, ఎంత ఆరాటపడ్డా
నిష్ప్రయోజనం.

పూర్వం పటిష్టంగా ఉండే ఇవి,
అరిషడ్వర్గాలపంజరంలో చిక్కుకోవడంవల్ల,
ధనం అడ్డుతెరగా నిలవడం వల్ల,
నేటితరంలో

కనుమరుగవుతున్నాయి.
అశాశ్వతమైన ధనాన్ని కాదని
ఆత్మీయతానుబంధాలను
సుస్థిరం చేసుకోవాలి.

వేమూరి శ్రీనివాస్
తాడేపల్లిగూడెం, 9912128967

## కామప్రేమ!

ప్రేమ, కామం
పరస్పర విరుద్ధాలనిపించే
ఒకటే భావజాలం
అబలల బలి కోరుతుంది...
విచ్చుకత్తిని ఆధునికత ముసుగులో దాచిన
ఏ ప్రేమ ఆమెని పట్టపురాణిని చేసింది?
నట్టనడిరోడ్డులో నిట్టనిలువునా నరికేయడం
తప్పు!
ఏ ప్రేమ ఆమె మనసు దాకా నడిచొచ్చింది
శరీరం దగ్గరే ఆగి అంతమై
అంతం చేయడం తప్పు!
'ఆమె ' ఆ పనికేనన్న పనికిమాలిన పురుషాధిక్య
కామజాలం ఏ బండ గుండెల్లో పుట్టిందో?
ఓ కామం...
ఆమెను చూసిందే తడవు
జనారణ్యంలో పగలైనా రాత్రయినా
ఓ వేటలా మాటేసి ఒడిసి పట్టుకొంటుంది
రాక్షస రతి, ఆమె యమలోకపు చావుతో
ఆ కామం అక్కడికలా తృప్తిపడి నిష్క్రమిస్తుంది!
తెల్లారి మళ్ళీ మరో బతుకు తెల్లార్చడానికి...
ఆధునికత ప్రబలుతోన్న జనారణ్యంలో
కామప్రేమ పట్ల అప్రమత్తతెంతో అవసరం!

- భీమవరపు పురుషోత్తమ్
9949800253

## ఎందుకు?

సరిపోతుందని తెలిసీ
చాలు అనరు!
ఒప్పించడం ముఖ్యమని
ఎరిగినా నొప్పిస్తారు!

తప్పదు అని తెలిసీ
తప్పించుకునే ప్రయత్నం!

ప్రకృతి
తన ధర్మాన్ని మరువదు!
వికృతి
మనిషికే ఎందుకు?

జగ్గయ్య.జి
9849525802

# ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు

హనుమకొండ అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
యువకులు హెచ్ఐవి/ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని అలాగే తమ మిత్రులకు, కుంటుంబ సభ్యులకు హెచ్ఐవి ఎయిడ్స్ పై అవగాహన కలిగించాలి అని టి.బి హాస్పిటల్ ఐసీటీసి కౌన్సిలర్ రాపర్తి సురేష్, ఆర్.డి.ఎం.ఎం స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఈశ్వర్, సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ ఇక్బాల్ పాషా సూచించారు.

బుధవారం, హనుమకొండ, కాజీపేట, ఫాతిమా నగర్ లోని గల ఫాతిమా ఐ. టి. ఐ. కళాశాల యందు తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ సంస్థ, ఆర్.డి.ఎం.ఎం. సంస్థ ఆధ్వర్యంలో, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెస్సర్ వసంత్ కుమార్ అధ్యక్షతన ఐ.ఈ.సి క్యాంపెయిన్ను, హెచ్.ఐ.వి/ఎయిడ్స్ మరియు సుఖవ్యాధి ల పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హెచ్ఐవి ఎయిడ్స్ నాలుగు మార్గాల ద్వారానే వస్తుంది. అవి 1) సురక్షితం కానీ లైంగిక సంబంధాల వల్ల 2) కలుషితమైన సూదులు ఇంజక్షన్ల ద్వారా 3) పరీక్షించని రక్త మార్పిడి వల్ల 4) హెచ్ఐవి తల్లి నుండి పుట్టబోయే బిడ్డకి ఈ నాలుగు మార్గాల ద్వారానే వస్తుందని తెలిపారు.

హెచ్ఐవి కి ఉన్న అపోహలను గూర్చి హెచ్ఐవి పేషెంట్లు వారితో కలిసిమెలసి ఉన్న వారి దేశంలో మనం ధరించిన వారిని ముట్టుకున్న పట్టుకున్న రాదు. ఈ వ్యాధి అంటూ వ్యాధి కాదు అంటించుకునే వ్యాధి అని వివరించి చెప్పడం జరిగింది. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యక్తుల పట్ల వివక్ష చూపకూడదని వారి పట్ల ప్రేమ,అబిమానాలు కలిగి ఉండాలని తెలియజేశారు. హెచ్ఐవి ఎయిడ్స్ కి చికిత్స ఉన్నదని దీనిపై అనుమానాలు ఉంటే ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత పరీక్షలు చేయించుకోవచ్చు అని తెలిపారు. అలాగే హెచ్. ఐ. వి ఉన్న వ్యక్తులు ఎటువంటి బయం లేకుండా ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచిత మందులు తీసుకోవాలని తెలిపారు .హెచ్ఐవి పేషంట్లకి ఏ.ఆర్. టి. మందులు వాడి జీవితకాలం పెంపొందించ్చు అని తెల్పినారు.

క్షయ వ్యాధి సంబంధం గూర్చి, సుఖ వ్యాధులు చికిత్స గురించి, కండోమ్ యొక్క ఉపయోగం గూర్చి తెలుపడం జరిగిందన్నారు. ఇంకా ఈ వ్యాధి గూర్చి తెలుసుకోవటానికి టోల్ ఫ్రీ నెంబర్ 1097 డయల్ చేసి తెల్సుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణ సురక్ష కేంద్రం ఔట్రీచ్ వర్కర్, రాజేంద్ర ప్రసాద్, ఆర్.డి.ఎం.ఎం. స్వచ్ఛంద సంస్థ ఔట్రీచ్ వర్కర్ ఎస్.అక్షర, అరుణ, మరియు కలశాల సిబ్బంది జె .బి డేవిడ్, ఎం. సోమయ్య, సూక్మల్,కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.






## ఎస్ టి యు మండల అధ్యక్షుడిగా మహమ్మద్ రజాక్

జమ్మికుంట అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో గల ధర్మారం పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘంమండల శాఖ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సమావేశంలో జమ్మికుంట మండలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరిగింది ఎస్టియు జమ్మికుంట మండల శాఖ అధ్యక్షులుగా Mdరజాక్ పాషా ప్రధాన కార్యదర్శిగా మేడుదుల నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా కుర్ర సమ్మయ్య ,అసోసియేట్ అధ్యక్షులుగా దేవునూరి రఘు, కార్యదర్శులుగా కే మహేందర్, వీఐఎం శ్రీనివాస్ ,బి రాజు జిల్లా కౌన్సిలర్ గా పి.పురుషోత్తమూర్తి ,ఎస్ రాజమౌళి లను ఏకగ్రీవంగా ఎన్నుకోన్నారు. ఎన్నికల పరిశీలకులుగా కోట శ్యాం కుమార్ వ్యవహరించినారు వీరి నియామకం పట్ల హర్షం వ్యక్తం చేసిన జిల్లా అధ్యక్షులు పిఆర్ శ్రీనివాస్ గారికి మరియు ప్రధాన కార్యదర్శి శ్రీ కట్ట రవీంద్ర చారి గారికి నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపినారు.



## ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే డా. సంజయ్

కోరుట్ల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
కోరుట్ల ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీరాజ్ మరియు ఇంజనీరింగ్ అధికారులతో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ మాట్లాడుతూ పలు రోడ్ల నిర్మాణానికి అంచనా విలువలు వేయాలని ఆయన ఆదేశించారు.గత ప్రభుత్వంలో మంజూరైనటువంటి రోడ్లు మరియు బ్రిడ్జిలు త్వరితగతన పూర్తి చేయాలని ఆయన తెలిపారు.గ్రామాల్లో పారిశుధ్యం చక్కగా నిర్వహించాలని ఎక్కడ చూసిన పారిశుద్ధ్య లోపం కనిపిస్తుందని ఆయన ఎంపీడీవోలకు ఆదేశించారు. ఈ సమావేశంలో కోరుట్ల ఎంపీడీవో రామకృష్ణ, ఇబ్రహీంపట్నం ఎంపీడీవొ చంద్రశేఖర్, మల్లాపూర్ ఎంపీడీవో జగదీష్,మెట్ పల్లి D.E రాంరెడ్డి, కోరుట్ల D.Eసత్యనారాయణ, ఎంపీవోలు, పంచాయతీరాజ్ మరియు ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇంగ్లీష్ రిసిటేషన్ ఈవెంట్‌లో ఫస్ట్ ర్యాంకు సాధించిన దాక్షిణ్య రెడ్డి

ఫోర్టుబ్లేయర్ (అండమాన్ నికోబార్) / భీమదేవరపల్లి అక్టోబర్ 23 (ప్రజామంటలు) :
అండమాన్ నికోబార్ దీవుల్లోని పోర్ట్ బ్లేయర్ నేవెల్ కిందర్ గార్డెన్ స్కూల్లో తుమ్మనపల్లి గ్రామానికి చెందిన గూడూరి ప్రశాంత్ రెడ్డి, మనో రంజిత ల కూతురు దాక్షిణ్య రెడ్డి ఇంగ్లీష్ రిసిటేషన్ ఈవెంట్ లో ఫస్ట్ ర్యాంకు సాధించినట్లు వారు తెలిపారు. ఫస్ట్ ర్యాంక్ రావడం పట్ల గ్రామ మాజీ సర్పంచ్ గూడూరు ప్రతాపరెడ్డి, ఎంపీటీసీ యాళ్ళ రాజేశ్వర్ రెడ్డి గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.









## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కోరుట్ల పట్టణానికి సంబంధించిన పది లక్షల తొంభై రెండువేల ఐదువందల రూపాయల విలువగల 42 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్. పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు నిరుపేదలకు అండగా నిలుస్తూ అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నాడని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నుండి మహిళలకు పింఛన్లు గాని ఇతర పథకాలు సరిగా అందడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కళ్యాణ లక్ష్మి చెక్కుతోపాటు తులం బంగారం ఇస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఆహామీని నిలబెట్టుకోలేక పోయాడని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కాశిరెడ్డి మోహన్ రెడ్డి, ఫాహీమ్, రహీంపాషా,ఆతిక్ తదితరులు పాల్గొన్నారు.

## మహమ్మద్ సుల్తానా బేగం జ్ఞాపకార్థం అన్నదానం



జనగామ అక్టోబర్ 23 (ప్రజామంటలు) :
జనగామ పట్టణానికి చెందిన మహమ్మద్ సుల్తానా బేగం జ్ఞాపకార్థం, కుమారుడు బషీర్ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పసరమడ్ల అతిథి స్వగృహంలో చిన్న పిల్లల ఆశ్రమంలో అన్నదానం, చేసి పండ్లు పంపిణీ చేశారు. జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణి కుమార్, ముఖ్య సలహా దారులు వంగ భీమ్ రాజ్ అమ్మ ఫౌండేషన్ టీమ్ సభ్యులు సల్ల మహేష్,మద్దెల కార్తిక్, మహమ్మద్ అఫ్రోజ్ పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఐడి కార్డులు సర్టిఫికెట్లు పంపిణీ



జనగామ అక్టోబర్ 23 (ప్రజామంటలు)
జనగామ కేంద్రంలో 27 వార్డులో రైల్వే స్టేషన్ ఆవరణలో ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి సంబంధించిన సర్టిఫికెట్ ను వార్డులో ఎంపికైన లబ్ధిదారులకు ఐడి కార్డులు సర్టిఫికెట్లు జనగామ బిజెపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సౌద రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి వీరలింగం వంగాల రవి ఎర్రం ప్రసాద్ శ్రీకాంత్ సాయి పాల్గొన్నారు.

## నేను ఇంకా బి ఆర్ ఎస్ లోనే ఉన్నాను

- గంగారెడ్డి హత్యకు నాకు ఎలాంటి సంబంధం లేదు
- ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ ప్రకటన




జగిత్యాల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఇప్పుడు పార్టీ ఫిరాయింపులని మాట్లాడుతున్నారు.నేను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదు, కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం తీసు కోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తే జగిత్యాల అభివృద్ధి చెందుతుందనేదే నా యోచన అని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. ఇవాళ ఫిరాయింపుల రాజకీయాల గురించి మాట్లాడుతున్న జీవన్ రెడ్డీది ఎలాంటి చరిత్రో అందరికీ తెలుసు. నాడు కాంగ్రెస్ ను తిడుతూనే రాజకీయాల్లోకి వచ్చిన చరిత్ర జీవన్ రెడ్డి ది. ఎన్టీఆర్ క్యాబినెట్లో మంత్రి అయ్యి, నాదెండ్ల భాస్కర్ రావుతో కలిసి మళ్లీ పార్టీ ఫిరాయించి, ఆనాడు ఎన్టీఆర్ ను ఏకాకిని చేసిండు జీవన్ రెడ్డి. అలాంటి వ్యక్తి నన్ను ఫిరాయింపుదారు అని, హత్యారాజకీయాలను ప్రోత్సాహిస్తున్నాడాని ఆరోపించడం ఆశ్చర్యమే కాకుండా, భాద్యకారమని అన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో నిన్నట్నుంచి జరుగుతున్న పరిణామాలు దురదృష్టకరం. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గంగారెడ్డి హత్య బాధాకరం, దాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. ఈ హత్యను సీనియర్ కాంగ్రెస్ నాయకుడై ఉండి, జీవన్ రెడ్డి రాజకీయం చేయడం బాధాకరం, దీన్ని కూడా నేను తీవ్రంగా ఖండిస్తున్నాను..గంగారెడ్డి హత్యకేసులో తన పక్కనున్న వారితో నా హస్తమున్నదని జీవన్ రెడ్డి మాట్లాడించడం చాలా దురదృష్టకరం అని ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.స్వాతంత్ర్యం రాక ముందు నుంచే మేం కాంగ్రెస్ వాదులం, కాంగ్రెస్ పార్టీ ఆఫీసుకు కేంద్రబిందువు మా ఇల్లు..మా కుటుంబం. అని ఎమ్మెల్యే డా. సంజయ్ అన్నారు.

## ఆకుల నర్సమ్మ కుటుంబాన్ని పరామర్శించిన గుగ్గిల్ల నర్సయ్య



జనగామ అక్టోబర్ 23 (ప్రజామంటలు) :
జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం నేలపోగుల గ్రామంలో ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందిన ఆకుల నర్సమ్మ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయంగా 75 కేజీల బియ్యాన్ని సాంస్కృతిక సేన రాష్ట్ర కార్యదర్శి నేలపోగుల మాజి ఎంపిటిసి దళిత రత్న డాక్టర్ గుగ్గిల్ల నర్సయ్య అందించారు.

ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు గైని ప్రవీణ్, ఓబీసీ సెల్ సభ్యులు జోగు రాజు, గ్రామ కోశధికారి బాకి అశోక్, సీనియర్ నాయకులు ఆకుల సత్తయ్య, గోగు కొమురయ్య, ఆకుల వెంకన్న, గుగ్గిల్ల నగేష్, గొలనకొండ నాగరాజు, తేరాల శ్రీకాంత్, యూత్ అధ్యక్షులు మైల రాజు, యూత్ ఉపాధ్యక్షులు పన్నీరు అరుణ్, పార్టీ కార్యకర్తలు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సివిల్ జడ్జి ని ఘనంగా సన్మానించిన బార్ అసోసియేషన్..



మెట్టుపల్లి అక్టోబర్ 23 (ప్రజా మంటలు)

మెట్ పల్లి సబ్ కోర్టు ఇంచార్జి సీనియర్ సివిల్ జడ్జి గా గత ఏడాదిన్నర నుండి కంచె ప్రసాద్ సార్ అందించిన సేవలు వెల కట్టలేనివని బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి అన్నారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఏర్పడిన సీనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు ఎదుర్కొన్న అనేక రకాల సమస్యల్ని వారు అలవోకగా పరిష్కరించారని అన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ మాట్లాడుతూ, సీనియర్ సివిల్ జడ్జి గారు భవిష్యత్ లో జిల్లా జడ్జిగా పదోన్నతి పొంది, మరిన్ని న్యాయసేవలు అందించాలని ఆకాంక్షించారు.

అనంతరం బదిలీ పై వెళ్తున్న సీనియర్ సివిల్ జడ్జి కంచె ప్రసాద్ మాట్లాడుతూ, మెట్ పల్లి బార్ కి మరియు కోర్టుకి చారిత్రత్మక నేపథ్యం ఉందని, ఇలాంటి కోర్టులో మొదటి ఆఫీసర్ గా పనిచేయడం తన అదృష్టం గా భావిస్తున్నట్టు అన్నారు.

**అనంతరం సీనియర్ న్యాయవాదులు** మగ్గిడి వెంకట నర్సయ్య, రాజ్ మహ్మద్, జిల్లా వెంకటేశ్వర్లు, కుమారం శ్రీనివాస్, కోటగిరి వెంకట స్వామి, చాప కిషోర్, గడ్డం శంకర్ రెడ్డి, కంతి మోహన్ రెడ్డి లు సీనియర్ సివిల్ జడ్జి చేసిన సేవల్ని కొనయాడారు. అనంతరం వారిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమం లో ప్రధాన కార్యదర్శి తునికి వేణుగోపాల్, ఏజీపి అబ్దుల్ హఫీజ్, న్యాయవాదులు మగ్గిడి నర్సయ్య, తులసి స్రవంతి, మామిడిపల్లి విజయలక్ష్మి, శ్రావణి మరియు మెట్ పల్లి, కోరుట్ల బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## గొల్ల పుల్లయ్య బావి ప్రాంతంలో పర్యటించిన కార్పొరేటర్ శైలజ



సికింద్రాబాద్, అక్టోబర్ 23 (ప్రజామంటలు) :

సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధనగర్ కార్పొరేటర్ కంది శైలజ బుధవారం డివిజన్ లోని గొల్లపుల్లయ్య బావి ప్రాంతంలో పర్యటించారు. ఈసందర్భంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్ళారు. డ్రైనేజీ, మంచినీటి సరఫరా తక్కువ ప్రెషర్ , చెట్ల కొమ్మల కొట్టివేత గురించి ఆమెకు వివరించారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఫోన్ లో సంబందిత జీహెచ్ఎమ్ సీ , హెచ్ఎమ్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన కార్పొరేటర్ శైలజకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు అజీజ్, రహ్మత్ తదితరులు పాల్గొన్నారు.

## భూ సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలి

•జిల్లా కలెక్టర్ బి, సత్య ప్రసాద్..





కోరుట్ల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :

జాతీయ రహదారి 63 నిర్మాణం కోసం చేస్తున్న భూ సేకరణ పనులను అధికారులు సమన్వయంతో త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సూచించారు. బుధవారం రోజున కోరుట్ల మండలంలోని మోహనరావుపేట్, గ్రామ సమీపంలోని , మరియు జగిత్యాల మండలంలోని తాటి పల్లి శివారులో జాతీయ రహదారుల అధారిటీ అధికారులు చేస్తున్న సర్వేను పరిశీలించి. పెండింగ్లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని, రోడ్డు నిర్మాణంలో రైతులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చేపట్టాలని, ఈ సందర్భంగా జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్న భూమి, ఇండ్లు, కట్టడాలు, బోర్లు, పైపులైన్లు, ఇతర నిర్మాణాలను పరిశీలించి, వాటికి చెల్లించాల్సిన నష్ట పరిహారం అంచన విలువలను ఆయాశాఖల అధికారులు సమన్వయంతో కలిసి పూర్తి చేయాలన్నారు.ఇప్పటి వరకు చేపట్టిన సర్వేలో భూములు కోల్పోతున్న వారు తెలిపిన అభ్యంతరాలను పరిగణలోకి తీసుకొని భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులకు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




## కోరుట్లలో గ్రాండ్ హెల్త్ చాలెంజ్

### జీవిత భాగస్వామికి వైద్య పరీక్షలు

కోరుట్ల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :

జగిత్యాల జిల్లా కోరుట్ల డిపోలో ఎం.డి సజ్జనార్ ఆదేశాల మేరకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్-%వా% ను కోరుట్ల డిపో మేనేజర్ మనోహర్ ఆధ్వర్యంలో కోరుట్ల వైద్యులు డాక్టర్ భోగ శంకర్ గారిచే ప్రారంభించడం జరిగింది. ఇట్టి కార్యక్రమాన్ని ఉద్దేశించి డిపో మేనేజర్ మనోహర్ మాట్లాడుతూ ఇదివరకు ఎం.డి ఆదేశాల మేరకు సంస్థలో పనిచేసే ప్రతి ఉద్యోగికి హెల్త్ చెకప్ చేశామని అన్నారు. అలాగే ఉద్యోగితో పాటు వారి జీవిత భాగస్వాములకు కూడా హెల్త్ చెకప్ చేయాలనే ఆదేశాలతో ఈ గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ ను ప్రారంభించడం జరిగింది. అలాగే డాక్టర్ బోగ శంకర్ మాట్లాడుతూ ఉద్యోగులను మరియు వారి భాగస్వాములను ఉద్దేశించి ఆరోగ్యానికి సంబంధించి తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో ఆఫీస్ సూపర్డెంట్, ట్రాఫిక్ సూపర్డెంట్, అసిస్టెంట్ మెకానికల్ ఫోర్ మెన్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మరియు అధిక సంఖ్యలో ఉద్యోగులు వారి జీవిత భాగస్వాములు పాల్గొన్నారు.



## గ్రూప్ వన్ పరీక్ష సెంటర్ల వద్ద ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయండి



సికింద్రాబాద్ అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :

గ్రూప్ వన్ పరీక్షా సెంటర్ లు రవాణాకు అందుబాటులో లేని ప్రాంతాలలో ఉన్నాయని, పరీక్షకు హాజరు అవుతున్న అభ్యర్థులు చాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందరికీ అనుగుణంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలని సకి ఫౌండశం వ్యవస్థాపక అధ్యక్షులు సతీష్ కుమార్ ప్రభుత్వానికి, ఆర్టీసీ ఎండి సజ్జనయర్ కు విజ్ఞప్తి చేశారు. ఉదయం సమయంలో ఎలానో కష్టపడి చేరుకుంటున్నారు. కానీ పరీక్ష అయిపోయాక వాళ్ళు వాళ్ళ గమ్యస్థానాలకు చేరుకోవడానికి అనేక విధాలుగా ఇబ్బందులు పడుతున్నారు. వాళ్ళ గమ్యస్థానాలకు చేరుకోవడానికి రాత్రి సమయం అవుతుంది. మళ్ళీ మరుసటి రోజు పరీక్షకు తొందరగా చేరుకోవాలి. సమయం సరిపోవడం లేదు, మానసికంగా కూడా అలసి పోతున్నారు, కావున ప్రతి పరీక్షా సెంటర్ వద్ద సాయంత్రం పరీక్ష ముగిసేసమయానికి పరీక్ష సెంటర్ వద్ద ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణ సంస్థ ఎం డి సజ్జనర్ గారికి మరియు ప్రభుత్వానికి స్కై ఫౌండేషన్ తరపున విజ్ఞప్తి చేస్తున్నాము. ముఖ్య కూడలిలో వదిలేసినా వాళ్ళు, వాళ్ళ గమ్యస్థానాలకు కొద్దిగా త్వరగా చేరుకునే అవకాశం ఉంటుందని సూచించారు.

## మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకం

• సికింద్రాబాద్ డిప్యూటీ డీఈవో శ్రీధర్



సికింద్రాబాద్, అక్టోబర్ 23 ( ప్జామంటలు) :

నేటి విద్యార్థులను రేపటి గొప్ప బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర కీలకమని సికింద్రాబాద్ డిప్యూటీ డీఈవో శ్రీధర్ అన్నారు. బుధవారం భోలక్ పూర్ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా డిప్యూటీ డీఈవో ను కలిశారు. విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, రాబోవు టెన్త్ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని మంచాల శ్రీనివాసులుకు డిప్యూటీ డీఈవో సూచించారు. ఈసందర్భంగా దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ డిప్యూటీ డీఈవో ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా కొమరం భీమ్ 84 వ వర్ధంతి వేడుకలు



మహాదేవపూర్ అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :

కొమరం భీమ్ పోరాటం వల్లనే ఆదివాసీల బతుకుల్లో వెలుగులు అని ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆదివాసి జేఏసీ జిల్లా అధ్యక్షులు గురుసింగా బాపు అన్నారు జయశంకర్ జిల్లా భూపాలపల్లి మహాదేవపూర్ మండల కేంద్రంలోని కొమరం భీం 84 వ వర్ధంతి సందర్భంగా కొమరం భీం విగ్రహానికి ఏటూరునాగారం ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి భీమ్రావు అధికారి నాయబ్ తాసిల్దార్ కృష్ణ మండల పరిషత్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నివాళి అర్పించి పూల మాల వేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఆదివాసీల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం మరియు పాలకులు పట్టించుకోవడంలేదని ఈ ప్రాంతంలో ఐటీడీఏ ఆఫీసును ఏర్పాటు చేయాలని పాత మాడ ఆఫీసును పున: ప్రారంభించాలని అన్నారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఏ టి డి ఓ క్షేత్రయ్య ఎంపీడీవో వెంకటేశ్వర్లు డిప్యూటీ తాసిల్దార్ కృష్ణ ఏ ఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి మాదే కుమార్ ఆదివాసి జిల్లా అధ్యక్షులు జయశంకర్ భూపాలపల్లి తుడుం దెబ్బ రాష్ట్ర నాయకులు కుడిమేత సమ్మయ్య తదితరులు ఉన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

### ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్







జగిత్యాల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే సంజయ్ అన్నారు. జిల్లా కేంద్రం లో ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో 5 కోట్ల తో అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన జగిత్యాల శాసన సభ్యులు డా. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, మహిళ డిగ్రీ కళాశాల లో మౌలిక సదుపాయాలు కల్పన కు కృషి చేస్తానాని, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు.గత 30 సం,రాలుగా తనకు కళాశాల తో అనుబంధం ఉందని, కళాశాల లో 1 కోటి 8 లక్షలతో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు,3 కోట్ల 92 లక్షలతో రెండస్తులలో అదనపు తరగతి గదులు,ఆధునిక టాయిలెట్ ల,ఇతర మౌలిక సదుపాయాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని, జగిత్యాల లో ఎస్సీ రెసిడెన్షియల్ కళాశాల ఏర్పాటు చేయటం జరిగింది..అధికారుల నిర్లక్ష్యం వల్ల కళాశాల 240 సీట్లు రద్దు కావడం జరిగింది అని,మళ్ళీ జగిత్యాల లో ఎస్సీ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశామని అన్నారు.బీర్ పూర్ మండలం లో కస్తూర్బా గాంధీ కళాశాల మంజూరు అయిందని, పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉపయోగంగా ఉంటుందని.దీపావళి తర్వాత ప్రారంభం కానుందని, స్వయం ప్రతిపత్తి రావడం జగిత్యాల జిల్లా విద్యార్థులకు చాలా ఉపయోగకరమని, విద్యార్థులు వృత్తి విద్య కోర్సుల పట్ల ఆలోచన చేయాలనన్నారు. అందరూ మూస పద్ధతిలో ఒకే కోర్సు లు చదవడం వల్ల ఉద్యోగాల సాధనలో వెనకబడతారని, పోటీ పరీక్షల నిరుద్యోగులకు ఎస్సీ రెసిడెన్షియల్ స్టడి సెంటర్ కూడా అందుబాటులో ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ,ప్రిన్సిపల్ రామ కృష్ణ,ఎస్ కె ఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ అశోక్, ఈ ఈ ఎడ్యుకేషన్ అనిత సింగ్,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం,రోటరీ క్లబ్ సభ్యులు మంచాల కృష్ణ,సిరిసిల్ల శ్రీనివాస్, సి పి డి సి సభ్యులు డా.శ్రీలత,ఖాన్ జియా,కౌన్సిలర్ లు చుక్క నవీన్,కూసరి అనిల్,కోరేగంగామల్లు,కూతురు రాజేష్,క్యాదాసు నవీన్,పిట్టధర్మరాజు, మస్కూ నారాయణ రెడ్డి,నాయకులు రామ్మోహన్ రావు,డిష్ జగన్,,చేట్పల్లి సుధాకర్,గడ్డం నారాయణ రెడ్డి,సుమన్ రావు, కూతురు శేఖర్,గట్టు రాజు,పోతునుక మహేష్,ప్రవీణ్ రావు,రాజు, శ్రీనివాస్,సంకే మహేష్,శ్రీనివాస్ రావు,ముకీద్,అజిత్ రావు,క్రాంతి,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సహకారంతోనే పట్టణ పరిశుభ్రత సాధ్యం

## ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్








జగిత్యాల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
ప్రజల సహకారంతోనే పట్టణ పరిశుభ్రత సాధ్యమని ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో వివేకానంద మినీ స్టేడియంలో జగిత్యాల పురపాలక సంఘనికి చెందిన తొమ్మిది నూతన స్వచ్ఛ ఆటో లను జెండా ఊపి జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ , ఆదనపు కలెక్టర్ గౌతం రెడ్డి ,మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ లి ప్రారంభించారు. ప్రజల సహకారం తోనే పట్టణం పరిశుభ్రంగా ఉండి, పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న సందర్భంలో జగిత్యాల మున్సిపల్ పై ఒత్తిడి,పని భారం పెరిగిందన్నారు.

ప్రజలు సరైన పద్ధతిలో తడి చెత్త ,పొడి చెత్తను వేరు చేసి అందజేయాలని, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల జగిత్యాల పట్టణం నిర్లక్ష్యానికి గురైంది..సరైన మాస్టర్ ప్లాన్ లేదని, పట్టణ పారిశుధ్య కార్మికులకు ఐ ఎం ఏ ఆధ్వర్యం లో ఆదివారం మెగా వైద్య శిబిరం ఉందని సద్వినియోగం చేసుకోవాలని,నూతన నిర్మాణాలు నిబంధనలకు లోబడి చేపట్టాలని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ చిరంజీవి, డి ఈ యాదగిరి,మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ లు,కో ఆప్షన్ సభ్యులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# చిలకలగూడ లో యువతి అదృశ్యం

సికింద్రాబాద్, అక్టోబర్ 23 (ప్రజామంటలు) :



చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ టీనేజీ యువతి అదృశ్యమైంది. మహిళా సబ్ ఇన్స్పెక్టర్ సబిత తెలిపిన వివరాల ప్రకారం...చిలకలగూడ కింది బస్తీలో చిదురుప ప్రమీల కుటుంబం నివాసం ఉంటుంది. ఆమె కూతురు చిదురుప మహాలక్ష్మి (23) ప్రైవేట్ జాబ్ చేస్తుంది. మహాలక్ష్మి విజయ్ అనే యువకుడిని ప్రేమించింది. అయితే విజయ్ మరో వివాహం చేసుకొని, ఓ కొడుకును కూడ కన్నాడు. అయినప్పటికీ విజయ్ పై ప్రేమ తగ్గని మహాలక్ష్మి తాను విజయ్ నే పెళ్ళి చేసుకుంటానని ఇటీవల కుటుంబసభ్యులతో గొడవ పడుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం ఇంట్లో వారికి చెప్పకుండా మహాలక్ష్మి ఎటో వెళ్ళిపోయింది. తమకు తెలిసిన చోటల్లా వెతికిన ఫ్యామిలీ మెంబర్స్ కు నిరాశే మిగిలింది. విజయ్ పైనే అనుమానం వ్యక్తం చేస్తూ, యువతి తల్లి ప్రమీల చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫొటోలోని యువతి ఆచూకీ తెలిసిన వారు పీఎస్ లో తెలపాలని ఎస్.ఐ సబిత కోరారు.

# శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి దేవాలయమునకు శావ అందించిన దాత





కొడిమ్యాల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) కొడిమ్యాల మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానమునకు కొడిమ్యాల వాస్తవ్యులు నాగుల గంగ మల్లయ్య లక్ష్మిల చిన్న కుమారుడు నాగుల రాజేశం - సుజాత వీరి సంతానం కూతురు: సాత్విక కుమారుడు: సాయి ప్రహర్ష్ ల కుటుంబం ప్రతి శ్రవణా నక్షత్రం రోజున ఉత్సవ మూర్తులను ఊరేగింపు కొరకై 30,016/- రూపాయల విలువగల “టేకు శావ (పల్లకి) ను భక్తుల సమక్షంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి వస్తు రూపేనా సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళా శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ , అభివృద్ధి కి సహకరించిన దాతల కుటుంబానికి ఆలయ నిర్మాణ కమిటీ, భక్తుల, గ్రామస్తుల తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

# గల్ఫ్ మృతుల ఎక్స్ గ్రేషియాకు 6 కోట్ల 45 లక్షల విడుదల

### (రామ కిష్టయ్య సంగన భట్ల)

ధర్మపురి అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
ముఖమంత్రి రేవంత్ రెడ్డి అదేశాల మేరకు గల్ఫ్ మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు కోసం తెలంగాణ ప్రభుత్వ జిఏడి ఎన్నారై విభాగం ఈనెల 21న రూ.6 కోట్ల 45 లక్షలను15 జిల్లాల కలెక్టర్లకు విడుదల చేసిందని టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మన్ అంబాసిడర్ డా. బిఎం వినోద్ కుమార్, కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డిలు తెలిపారు. 2023 డిసెంబర్ 7 నుంచి నేటి వరకు గల్ఫ్ లో 160 మంది తెలంగాణ కార్మికులు మృతి చెందినట్లు అంచనా. నిధుల విడుదలకు సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు బి. మహేష్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులకు, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. గల్ఫ్ మృతుల సంఖ్య ఆధారంగా నిజామాబాద్ జిల్లాకు రూ.1 కోటి 75 లక్షలు, జగిత్యాలకు రూ.1 కోటి 40 లక్షలు, రాజన్న సిరిసిల్లకు రూ.60 లక్షలు, నిర్మల్ కు రూ.50 లక్షలు, కామారెడ్డి, కరీంనగర్, మేడ్చల్, ఆదిలాబాద్, హన్మకొండ, భద్రాద్రి కొత్తగూడెం, పెద్దపల్లి, మెదక్ జిల్లాకు రూ.20 లక్షల చొప్పున నిధులు విడుదల చేశారని వారు తెలిపారు.
2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటి వరకు గల్ఫ్ లో 160 మంది తెలంగాణ కార్మికులు మృతి చెందినట్లు అంచనా. గల్ఫ్ మృతుల సంఖ్యను బట్టి అన్ని జిల్లాలకు తగిన నిధులు విడుదల చేస్తారని ఇందుకోసం మొత్తంగా రూ.10 కోట్ల 60 లక్షలు కేటాయించారని వినోద్ కుమార్, భీంరెడ్డి తెలిపారు.

# బ్రిడ్జిల మరమ్మత్తులు తక్షణమే చేయాలని టిడిపి వినతి

కోరుట్ల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :



పట్టణం పరిసర గ్రామాలలో రెండు గ్రామాలను కలిపే బ్రిడ్జిల మరమ్మత్తులు తక్షణమే చేపట్టేలా తగు చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ తాసిల్దార్ ఇట్యాల కిషన్ కు వినతి పత్రం అందజేశారు. ఎన్నో ఏళ్లుగా ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తికాక అనేక గ్రామాల రాకపోకలు నిలిచిపోయి అన్నదాతలకు ప్రజలకు ఎన్నో ఇబ్బందులు అవుతున్నాయని, ఈ బ్రిడ్జిల నిర్మాణం త్వరగా పూర్తిచేస్తే అనేక గ్రామాల ప్రజలకు దూరం తగ్గడంతో పాటు రవాణా సౌకర్యం మెరుగు పడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సంబంధించిన కొనుగోలు కేంద్రాలలో అవినీతి జరగకుండా కొనుగోలు ఏర్పాటు కాని చోట తక్షణమే ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాల వద్ద దళారీ వ్యవస్థ లేకుండా రైతులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో టిడిపి కోరుట్ల నియోజకవర్గ నాయకులు పాతర్ల విజయ్, మోహన్, మహదేవ్, మహేష్, రాజ గంగారం తదితరులు ఉన్నారు.

# అన్నదాతలకు కుచ్చు టోపి .. రైతుభరోసా రాక ఆందోళన

### అధిక వడ్డీకి అప్పులు చేస్తున్నా రైతులు

### రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రైతు భరోసా ప్రకటించాలి

### రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ డిమాండ్

ఎల్కతుర్తి అక్టోబర్ 23 అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
ఎల్కతుర్తి మండల కేంద్రంలోని తెలంగాణ రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీలు అర్హులైన రైతులకు రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా వానకాలం యాసంగి సంబంధించిన 15 వేల రూపాయలు వెంటనే రైతుల అకౌంట్లో తక్షణమే వేయాలని తాసిల్దార్ జగత్ సింగ్ కు రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ వినతి పత్రం అందజేశారు. హింగే భాస్కర్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు అందించే ఆర్థిక సహాయం ఎకరాకు రూ. 5000 నుండి రూ. 7500 ఇస్తామని ప్రకటించి, అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి అయినా నేటికీ రైతుకి ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా నిధులు రైతుల ఖాతాలలో వేయక పోవడం విచారకరమన్నారు. దీనితో సాగు పెట్టుబడి కోసం రైతులు అధిక వడ్డీలకు ప్రైవేటు రుణాన్ని తీసుకొని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చేసిన అప్పులు తీర్చలేక ఆందోళనలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాపోయారు. ఇప్పుడు పంట వేసే సమయం నుండి కోసే సమయం వచ్చినప్పటికీ ఏ ఒక్క రైతు ఖాతాలలో రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రైతుల సమస్యలు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో కరోనా కష్టకాలంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న రైతులను కాపాడుకొని రైతుబంధు వేసిన ఘనత కెసిఆర్ దే అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కొక్కు తిరుపతి, మండల కార్యదర్శి కోదాడి మాధవరావు, అశోక్ రైతులు తదితరులు పాల్గొన్నారు



# రంగారెడ్డి మాజీ కలెక్టర్ అమయ్ కుమార్ ను సుదీర్ఘంగా ప్రశ్నించిన ఈడీ

### భూకేటాయింపు అక్రమాలపై అమోయ్ కుమార్‌ను ప్రశ్నించిన ఈడీ

### ఏడున్నర గంటల పాటు వివిధ అంశాలపై ఈడీ ప్రశ్నలు

హైదరాబాద్ అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :



రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ అమోయ్ కుమార్‌ను ఈడీ ఏడున్నర గంటల పాటు విచారించింది. రంగారెడ్డి జిల్లాలో భూకేటాయింపులపై అక్రమాలు జరిగాయన్న కేసులో అమోయ్ కుమార్‌కు ఈడీ నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన ఉదయం 8 గంటలకు మీడియా కంటపడకుండా బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చారు.ఈడీ అధికారులు ఆయనను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విచారించారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే 42 ఎకరాల భూమిని అక్రమంగా ఎలా బదిలి చేశారని ఈడీ ప్రశ్నించినట్లుగా తెలుస్తోంది. అమోయ్ కుమార్ గతంలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలకు కలెక్టర్‌గా పని చేశారు.అధికార దుర్వినియోగం, ఆర్థిక దుర్వినియోగం ఆరోపణలతో ఆయన హయాంలో జరిగిన భూ ఒప్పందాలు, కేటాయింపులపై దర్యాప్తు దృష్టి సారించింది. చట్టపరమైన విధానాల ఉల్లంఘనలు మరియు భూ కేటాయింపులకు సంబంధించిన ఆర్థిక అవకతవకలు ఏమైనా ఉన్నాయా అని నిర్ధారించడానికి ఈడీ ఈ ఫిర్యాదులను పరిశీలిస్తోంది. ఆమోయ్ కుమార్ ను ఈడీ పిలవడం అనేది ఇతర అధికారులు మరియు వాటాదారులను మరింత ప్రశ్నించే అవకాశం ఉన్న పెద్ద విచారణలో ఒక భాగం మాత్రమేనాని అనుకొంటున్నారు. ఇంకా చాలామంది అధికారులను, రాజకీయ నాయకులను కూడా విచారించే అవక్షం ఉందని తెలుస్తుంది.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోరుట్ల అక్టోబర్ 23 (ప్రజా మంటలు) :
కోరుట్ల మండలం మొహన్ రావుపేటలో చదివిన 1997-1998 విద్యా సంవత్సరపు విద్యార్థులు ఆత్మీయంగా కలిసారు. ఈ సందర్భంగా కలిసిన పూర్వ విద్యార్థులు ఇరువురు కలిసి వారివారి గత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. పలు దేశాలలో వివిధ హొదాల్లో స్థిరపడిన వీరు తమ సంతోషకర అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో అశోక్,చిన్నన్న, రాజు,సురేష్, నాగరాజు, వెంకటేశ్, సత్తన్న,సత్తనారాయణ, శ్రీను,శేఖర్,లక్ష్మిరాజం,కిరణ్ గౌడ్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్ మం. ఓబులాపూర్ గ్రామంలో గత 3 రోజుల క్రితం అన్నని చంపిన తమ్ముడితో పాటు మరో ఇద్దరినీ అదుపులోకి తీసుకొని అరెస్టు చేసిన మెట్ పల్లి పోలీసులు.

## క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాల

### సిఐటియు జిల్లా నాయకుల డిమాండ్

మంగళగిరి,అక్టోబర్23 (ప్రజా మంటలు):
మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ జంగయ్య అన్నారు. క్లాప్ ఆటో డ్రైవర్ల రెండు నెలల వేతనాలు చెల్లించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ క్లాస్ ఆటో డ్రైవర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ మంగళగిరి కార్యాలయం ఎదుట బుధవారం ఆటో డ్రైవర్లు నిరవధిక సమ్మె శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. చాంగయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ సాలీ సాలని వేతనాలతో క్లాప్ డ్రైవర్లుగా పనిచేస్తున్నారని, రెండు నెలలుగా కాంట్రాక్టర్ వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. కనీస
వేతనం 26 వేల రూపాయలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. 12,500 వేతనానికి మాత్రమే చేస్తున్నప్పటికీ సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదని విమర్శించారు. పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై కమలాకర్, ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ లు ప్రసంగించారు. క్రాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లిస్తేనే సమ్మె నిర్మిస్తారని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ నాయకులు రవి, మనీ, నాని, సతీష్, శివ, యోహాన్, ఆర్ కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## వైకాపాకు మరో భారీ షాక్

### మహిళా నేత వాసిరెడ్డి పద్మ రాజీనామా

### జగన్ నియంతృత్వంపై ఘాటు విమర్శలు

విజయవాడ,అక్టోబర్23 (ప్రజా మంటలు):



వైసిపికి మరో షాక్ తగిలింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత పలువురు నాయకులు జగన్ కు గుడ్ బై చెబుతూ పార్టీని విడుతున్నారు. ఇప్పటికే పలువురు నాయకులు పార్టీకి రాజీనామా చేశారు. తాజాగా ఆ పార్టీ మహిళా నేత వాసిరెడ్డి పద్మ కూడా రాజీనామా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ నుంచి ఆమె టికెట్ ఆశించారు. జగన్ మాత్రం ఆమెకు టికెట్ ఇవ్వలేదు. దీంతో కొంతకాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్న వాసిరెడ్డి పద్మ.. బుధవారం పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను జగన్ కు పంపారు. ఇందులో జగన్ విధానాలను తీవ్రంగా విమర్శించారు. గుడ్ బుక్ పేరుతో మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కార్యకర్తల కోసం గుడ్ బుక్ కాదు..గుండె బుక్ కావాలన్నారు. జగన్‌వి అప్రజాస్వామిక పద్ధతులు, నియంతృత్వ ధోరణి, సమాజం పట్ల, పాలనలో, పార్టీని నడపడంలో జగన్ బాధ్యతగాలేరని వాసిరెడ్డి పద్మ విమర్శలు చేశారు. వైకాపా పాలనలో మాజీ సీఎం జగన్ ప్రజలను అన్నివిధాలుగా మోసం చేశారు. ప్రభుత్వ మద్యం పేరిట పేద ప్రజలను దోచుకున్నారు. ఐదేళ్ల పాలనలో ఎప్పుడూ ప్రజా సమస్యలను పట్టించుకోలేదు. వైకాపాలో మహిళలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు. ఎన్నో అవమానాలు ఎదురైనా క్రమశిక్షణ కలిగిన నేతగా పార్టీ కోసం పనిచేశాను. మహిళలపై జరుగుతున్న దాడులను వైకాపా రాజకీయంగా వాడుకోవడం బాధాకరం. గత ప్రభుత్వం హయాంలోనూ అనేక దాడులు జరిగాయి. సీఎం హోదాలో జగన్ ఎప్పుడూ బాధితులను పరామర్శించలేదు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, దాడులను ఆయన దృష్టికి తీసుకెళ్లినా కనీస చర్యలు తీసుకోలేదు. పార్టీని నడిపించడంలో, పాలనలో జగన్‌కు బాధ్యత లేదు. నియంతృత్వ ధోరణిని ప్రజలు మెచ్చుకోరని ఎన్నికల తీర్పు స్పష్టం చేసింది. జగన్ 'గుడ్ బుక్' పేరుతో మరోసారి మోసానికి సిద్ధమయ్యారు. నాయకులు, కార్యకర్తల కోసం ఉండాల్సింది 'గుడ్ బుక్' కాదు 'గుండె బుక్' అని వాసిరెడ్డి పద్మ పేర్కొన్నారు.కాగా, వైసీపీ హయాంలో మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా ఆమె బాధ్యతలు నిర్వహించారు.

## నాంపల్లి కోర్టులో నాగార్జున పరువు నష్టం కేసు

### అడ్వకేట్ ద్వారా రిప్లై దాఖలు చేసిన కొండా సురేఖ

హైదరాబాద్, (ప్రజా మంటలు):



మంత్రి కొండా సురేఖపై ప్రముఖ సినీనటుడు నాగార్జున వేసిన పరువునష్టం దావాపై నాంపల్లి స్పెషల్ కోర్టులో విచారణ జరిగింది. మంత్రి కొండా సురేఖ తరఫున అడ్వకేట్ గుర్మీత్ సింగ్ రిప్లై ఫైల్ చేశారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 30కి వాయిదా వేసింది. సినీ నటుడు అక్కినేని నాగార్జున కుటుంబాన్ని, వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ ఇటీవల మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో నాగార్జున ఆమెపై పరువు నష్టం దావా వేశారు. తమ కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠ దెబ్బతీసేలా సురేఖ వ్యాఖ్యలు చేశారంటూ నాంపల్లి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. నాగార్జున కేసుతో మంత్రి కొండా సురేఖకు నాంపల్లి స్పెషల్ కోర్టు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. హీరో నాగార్జున వేసిన క్రిమినల్, పరువునష్టం దావా కేసులో వివరణ ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అక్కినేని నాగ చైతన్య, సమంత విడిపోవడానికి కేటీఆర్ కారణమంటూ కొండా సురేఖ చేసిన కామెంట్స్‌పై నాగార్జున కోర్టును ఆశ్రయించారు. ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. ఓపెన్ కోర్టులో నాగార్జున సహా సాక్షులుగా ఉన్న యార్లగడ్డ సుప్రియ, మెట్ల వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని న్యాయమూర్తి ఇప్పటికే రికార్డు చేశారు. నాగార్జున అందించిన ఆధారాలను పరిగణలోకి తీసుకున్నారు. నాగార్జునపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివరణ ఇవ్వాలని కొండాకు జారీ చేసిన నోటీసుల్లో కోర్టు పేర్కొంది.

## నీ తాటాకు చప్పళ్లకు భయపడే వాళ్లం కాదు

### నోటీసులకు నోటీసులతోనే సమాధానం ఇస్తున్నా

### నువ్వెంత సుద్దపూసో ..ప్రజలకు తెలుసు

### కెటిఆర్ నోటీసులపై బండి సంజయ్ ఘాటు సమాధానం

హైదరాబాద్, (ప్రజా మంటలు):



లీగల్ నోటీసులతో భయ పెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పంపిన లీగల్ నోటీసు లపై ఆయన స్పందించారు. నన్ను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీసులు ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోంది. తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదు. నాపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే. అందుకు బదులుగానే నేను మాట్లాడాను. ఆయన బాగోతం ప్రజలకు తెలుసు. ఫోన్ ట్యాపింగ్, డ్రగ్స్ కేసు వ్యవహారంలో ఏం జరిగిందో, ఆ కేసులను ఏ విధంగా నీరుగార్చారో తెలుసు. ఇప్పటి వరకు మాటకు మాటతోనే బదులిచ్చాను. లీగల్ నోటీసులకు నోటీసులతోనే బదులిస్తా. మేం చట్టాన్ని, న్యాయాన్ని గౌరవించే వ్యక్తులం. చట్టం, న్యాయం ప్రకారం ముందుకు వెళ్తాం అని అని బండి సంజయ్ పేర్కొన్నారు. తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ కేంద్రమంత్రి బండిసంజయ్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లీగల్ నోటీసు పంపిన విషయం తెలిసిందే. తాజాగా కేటీఆర్ లీగల్ నోటీసుపై కేంద్రమంతి ఘాటైన జవాబిచ్చారు. తాటాకు చప్పళ్లకు భయపడేది లేదు. రాజకీయంగా ఎదుర్కోలేక నోటీసులా.. విమర్శలకు నోటీసులే సమాధానమా.. అయితే నీకు నోటీసులు పంపుతా... కాచుకో. నువ్వు సుద్దపూస అనుకుంటున్నవా.. నన్ను అవమానిస్తూ మాట్లాడితేనే బదులిచ్చిన. మాటకు మాట... నోటీసుకు నోటీసుతోనే జవాబిస్తా అంటూ ఘాటుగా సమాధానం ఇచ్చారు. మాజీ మంత్రి కేటీఆర్ తనకు లీగల్ నోటీసు పంపినట్లు మీడియాలో చూసినట్లు తెలిపారు. లీగల్ నోటీసుతో భయపెట్టాలని చూస్తే ఇక్కడ భయపడే వారెవరూ లేరన్నారు. తనను రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక లీగల్ నోటీస్ ఇవ్వడం చూస్తుంటే జాలేస్తోందని... స్పష్టం చేశారు. తనపై తొలుత వ్యక్తిగత ఆరోపణలు చేసి అవమానించింది కేటీఆరే అని చెప్పుకొచ్చారు. అందుకు బదులుగానే మాట్లాడినట్లు తెలిపారు.కేంద్రమంత్రి బండి సంజయ్‌కు మాజీ మంత్రి కేటీఆర్ లీగల్ నోటీసులు ఇచ్చారు. తన పరువుకు నష్టం కలిగేంచేలా వ్యాఖ్యలు చేశారని .. వారం రోజుల్లో బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే లీగల్ యాక్షన్ తప్పదని హెచ్చరించారు. అక్టోబర్ 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ.. తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ తన నోటీసుల్లో పేర్కొన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటానని, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డానని నిరాధారణ ఆరోపణలు చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా కేంద్రమంత్రి ప్రస్తావరించారని నోటీసుల్లో పేర్కొన్నారు.

## అధికారంలో ఉండగా బాధితులు కానరాలేదా

### ఏనాడైనా ఎవరినూనా పరామర్శించావా

### జగన్ గుంటూరు పర్యటనలపై ఆలపాటి విమర్శలు

### జగన్ శవ రాజకీయాలు మానాలన్న గల్లా మాధవి

గుంటూరు,అక్టోబర్23 (ప్రజా మంటలు):



ముఖ్యమంత్రిగా ఉండగా జగన్ ఏనాడైనా పరామర్శలకు వెళ్లారా అంటూ మాజీ మంత్రి ఆలపాటి రాజా ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుంటూరు పర్యటనపై ఆలపాటి బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. తాడేపల్లి ప్యాలెస్ పక్కనే జరిగిన అత్యాచారం పై కనీసం నోరు మెదపలేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక నీ బాబాయి హత్య గురించి నోరు విప్పలేదు. నేరపూరిత ఆలోచనలతో కూడిన పాలన జగన్ ఐదేళ్లు చేశారు. దళితులు, మైనార్టీలు, బీసీలు హత్యకు గురైనప్పుడు ఎప్పుడైనా జగన్ పరామర్శించారా. పరామర్శల పేరుతో రాజకీయంగా మాపై బురజ జల్లుతున్నారని అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరద బాధితులకు జగన్ ప్రకటించిన రూ.కోటి సాయం ఎక్కడ ఇచ్చారని ప్రశ్నించారు. మరి ఇప్పుడైనా ప్రకటించిన రూ.10 లక్షల సాయం జగన్ ఇస్తారా అంటూ నిలదీశారు. సహనపై దాడి చేసిన నవీన్ తల్లి తమ కుటుంబం వైసీపీలో ఉందని చెప్పిందన్నారు. కానీ జగన్ మాత్రం నిందితుడిని టీడీపీ వ్యక్తి అని అసత్యాలు చెప్పారన్నారు. ఎవరితోనో ఫొటోలు దిగితే తమ పార్టీ వాళ్లు అయిపోతారా అంటూ మండిపడ్డారు. రౌడీయుజాన్ని, అరాచకాలు, మహిళలపై దాడులకు పాల్పడిన వారిని క్షమించమమని అన్నారు. జగన్మోహన్ రెడ్డి జులుం ప్రదర్శించాలని చూస్తే కుదరదంటూ మాజీ మంత్రి ఆలపాటి రాజా స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌పై ఎమ్మెల్యే గల్లా మాధవి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాలుగు నెలలకే కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడ శవం దొరికితే అక్కడకు వెళ్లి ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పిచ్చోడు చేతిలో రాయి ఉన్నట్లు కూటమి ప్రభుత్వంపై విమర్శిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం మహిళలు, ఆడపిల్లల భద్రత విషయంలో చిత్తశుద్ధితో పని చేస్తోందని వెల్లడించారు. హోంమంత్రి నేరుగా వెళ్లి బాధితులను పరామర్శించి పరిహారం అందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వంపై బురద జల్లటం కోసమే మీతో పాటు మీ పార్టీ నేతలు పని చేస్తున్నారు.11 మంది ఎమ్మెల్యేలు గెలిచిన చోట ఏం చేస్తున్నారో చెప్పాలి. దేవుడు పై నుంచి చూస్తున్నారని జగన్ అంటారు... భగవంతుడు చూశారు కాబట్టే మీకు 11 సీట్లు ఇచ్చారని అన్నారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా శవాల చుట్టూ రాజకీయం చేయటం హాస్యాస్పదమన్నారు. జగన్ ఈసారి శవ రాజకీయాలు చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే గల్లా మాధవి హెచ్చరించారు.

## రోడ్డు ప్రమాదంలో భర్త మృతి గంటల తేడాలో భార్య డెలివరీ

### విషాద ఘటనతో కటుఉంబ సభ్యులు రోదనలు

కర్నూలు,అక్టోబర్ 23 (ప్రజా మంటలు):



ఆ దంపతులకు వివాహమై 14 నెలలు అవుతోంది. భార్య నెలలు నిండిన గర్భిణి. భర్త బుధవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో రోడ్డు ప్రమాదంలో మరణించాడు. భార్య తెల్లవారుజామున 4 గంటలకు పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. కొడుకును చూడకుండా తండ్రి అనంతలోకాలకు చేరిన భర్త అంత్యక్రియల్లో పాల్గొనలేని దుస్థితి ఆమెది. రాజోళి మండలం తుమ్మలపల్లికి చెందిన కురువ కొత్తకోట శివ(28) మంగళవారం సాయత్రం ద్విచక్ర వాహనంపై వెళ్లే క్రమంలో అదుపుతప్పి కిందపడి గాయాలపాలయ్యాడు. దీంతో ఏపీలోని కర్నూల్ ప్రభుత్వ దవాఖానలో స్థానికులు చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యరాత్రి ఒంటిగంట ప్రాంతంలో మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి గర్భిణీ కావడంతో ఆమె తల్లిగారిల్లు నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం బలపాలపల్లికి వెళ్లింది. ఆమెకు కూడా పురిటినిప్పులు రావడంతో దవాఖానకు తరలించగా.. బుధవారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే లోబీపీ ఉండడంతో వైద్యుల సూచన మేరకు ఆమెకు భర్త మృతి చెందిన విషయాన్ని కుటుంబీకులు చెప్పలేదు. తర్వాత చివరి చూపుకోసం చెప్పడంతో ఆమె రోదన కలిచివేసింది. విధి ఆడిన నాటకంలో ఆమె భర్త అంత్యక్రియలకు సైతం వెళ్లలేకపోయింది.

## ప్రజాభిప్రాయ సేకరణ ఓ ప్రహసనం

### బిఆర్ఎస్ నేత ముందస్తు అరెస్ట్ దారుణం

### మండిపడ్డ మాజీమంత్రి జగదీశ్ రెడ్డి

యాదాద్రి భువనగిరి,అక్టోబర్23 (ప్రజా మంటలు):



రామన్నపేటల నిర్మించ తల పెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్తున్న మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, రవీందర్ కుమార్, కంచర్ల భూపాల్ రెడ్డి, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి నేడు జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ ఒక ప్రహసనం అన్నారు. ప్రజల మధ్య జరపకుండా ఎక్కడో మారుమూలలో దొంగ చాటుగా రాసుకోడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మా అభిప్రాయాలు చెప్పడానికి వెళ్తున్న ప్రజా ప్రతినిధులను అడ్డగిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజలను, ప్రజాసంఘాల నాయకులను, ప్రజా ప్రతినిధులను, పార్టీల నాయకులను అరెస్ట్ చేసి ఏ ప్రజల అభిప్రాయాలు తీసుకుంటారని ప్రశ్నించారు. నల్లగొండ, యాదాద్రి, రాచకొండ కమిషనరేట్ పోలీస్ అధికారులు, జిల్లా కలెక్టర్లు ఈ నిర్భందాలకు బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. రేవంత్ రెడ్డి పరిపాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. కోదండరాం, హరగోపాల్ ఇప్పుడైనా గొంతులు విప్పుతారా? అని నిలదీశారు. ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రజలందరూ వాళ్ల అభిప్రాయాన్ని స్వేచ్ఛగా చెప్పే వాతావరణం కల్పించి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని డిమాండ్ చేశారు. నిర్భందించిన ప్రజా ప్రతినిధులను వెంటనే విడుదల చేయాలన్నారు.

## కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మే ప్రయత్నం

### జగన్ రెడ్డి పాలనలో మహిళలపై విపరీత దాడులు

### మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా

అమరావతి,అక్టోబర్ 23 (ప్రజా మంటలు):



ఎన్నికల్లో ఘరోపరాజయంతో పరాభవంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి గుడ్డెద్దు చేలో పడ్డట్టుగా వ్యవహరిస్తున్నారంటూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఎద్దేవా చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంపై విషం చిమ్మాలనే ప్రయత్నంలో నోటి కొచ్చిందల్లా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ రెడ్డి పాలనలో మహిళలపై జరిగినన్ని దాడులు ఇంకెప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఐదేళ్లలో 2 లక్షలకు పైగా కేసులు నమోదైతే.. వాటిని నిరోధించేందుకు అసలు చర్యలు తీసుకున్నారా అని నిలదీశారు. తన ఇంటి పక్కనే దళిత యువతిపై గ్యాంగ్ రేప్ జరిగితే నిందితుడు వెంకటరెడ్డిని ఐదేళ్ల పాటు అరెస్ట్ చేయకుండా చోద్యం చూసిన జగన్.. శాంతిభద్రతల గురించి మాట్లాడుతుంటే సిగ్గేస్తుందంటూ వ్యాఖ్యలు చేశారు. తన నియోజకవర్గంలోనే దళిత మహిళ నాగమ్మపై ఆత్యాచారం జరిగితే జగన్ రెడ్డి కనీసం పట్టించుకున్నారా అని మండిపడ్డారు. జగన్ రెడ్డి తన పాలనలో యువతను గంజాయి, డ్రగ్స్, నాసిరకం మద్యానికి అలవాటు చేసి వారిని పెడదారి పట్టించారని విమర్శించారు. ఆ ప్రభావంతోనే సైకోలుగా మారిన మగాళ్లు మహిళలపై దాడులు కొనసాగిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం నేరాలను ఉక్కుపాదంతో అణిచివేస్తోందని స్పష్టం చేశారు. మహిళలపై దాడులు జరిగిన ఘటనల్లో వెనువెంటనే పార్టీలకు, కులాలకు, ప్రాంతాలకు అతీతంగా నిందితులను అరెస్ట్ చేసి శిక్షిస్తున్నామని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

## ప్రజాభిప్రాయమని చెప్పి అడ్డుకుంటారా

### బిఆర్ఎస్ నేతల అరెస్ట్‌పై మండిపడ్డ కెటిఆర్

### కాంగ్రెస్ నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శలు

హైదరాబాద్, (ప్రజా మంటలు):
రామన్నపేటలో దొంగచాటుగా నిర్మించ తలపెట్టిన అదానీ–అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీపై నిర్వహిస్తున్న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు బీఆర్ఎస్ నేతలు వెళ్లకుండా ఎక్కడికక్కడ అడ్డుకోవడం, హౌజ్ అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య అని పార్టీ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డిని హౌస్ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, చిరుమర్తి లింగయ్యలు ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం నియంతృత్వం కాక మరేంటని ప్రశ్నించారు. వీరితోపాటు ప్రజాసంఘాల ప్రతినిధులు, పర్యావరణవేత్తలను ముందస్తు అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేయడం రేవంత్ సర్కారు అణచివేత విధానాలకు నిదర్శనమని చెప్పారు. ఇంతటి నిర్బంధ పరిస్థితులను సృష్టించి నిర్వహించే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు విలువ ఉండదన్నారు. ఇది ముమ్మాటికీ అదానీ ఆదేశాలతో ముఖ్యమంత్రి రేవంత్ సాగిస్తున్న అరాచక పర్వమని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా నిర్బంధించిన బీఆర్ఎస్ నాయకులతోపాటు ప్రజాసంఘాల నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ సర్కారుకు దుమ్ముంటే ఎలాంటి నిర్బంధాలు లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ జరపాలన్నారు.

DIGITALLY PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AT 6-3-144, bRAHMAN WADA, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com